ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
5
ఆదివారం 27 జూలై 2025

భావి భారతం కష్టాలతో సహవాసం

- కనీస సౌకర్యాలు కరువాయె..
- శిథిలావస్థలో భవనాలు
- వర్షం పడితే జాగరణే
- పందులు, కుక్కల స్వైర విహారం
- ఆరుబయటే స్నానాలు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు మాత్రం ఇక్కట్లు తప్పడం లేదు. నేటి బాలలే రేపటి భావిభారత పౌరులు. భావి భారతం కష్టాలతో సహవాసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో సంక్షేమ వసతిగృహాలు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. సంక్షేమ వసతిగృహం అంటే సమస్యలకు కేరాఫ్ అన్నట్లుగా ఉంది పరిస్థితి. ఒకటి అర అయితే సర్దుబాటు చేసుకుంటున్నారు చిన్నారులు. కానీ అన్నీ ఇబ్బందులే ఎదురైతే వారు ఎలా తట్టుకోగలరు. వసతిగృహాల్లో చదివి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలనుకున్న పిల్లలకు సమస్యలు భయ పెట్టిస్తున్నాయి. పగలు, రాత్రులు అనే తేడా లేకుండా నిత్యం కష్టాల కడలిలో చదువులు సాగిస్తున్నారు.


పెద్దపాడు బీసీ బాలుర వసతి గృహంలో కుక్కల మధ్య భోజనం చేస్తున్న విద్యార్థులు

ఫ్యాన్ రెక్క తగిలి తలకు గాయమైన విద్యార్థి(ఫైల్)

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నేటి బాలలే రేపటి భావి భారతపౌరులు. ఇలాంటి భావిభారతం.. కష్టాల కడలిలో ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలో సంక్షేమ వసతిగృహాలు సమస్యల సుడిలో కొట్టుమిట్టాడుతున్నాయి. కర్నూలు నగరపాలక పరిధిలోని పెద్దపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలోనే వెనుకబడిన తరగతుల సంక్షేమ బాలుర వసతి గృహం ఉంది. ఇక్కడ 145 మంది పేద విద్యార్థులు పదో తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. 40 సంవత్సరాల క్రితం హాస్టల్‌కు ఆరు గదులతో స్వంత భవనం నిర్మించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా షెడ్డును నిర్మించారు. భవనం శిథిలావస్థకు చేరింది. ఇందులో నాలుగు గదులను మాత్రమే విద్యార్థులు ఉపయోగించుకుంటున్నారు, మరో రెండు గదులను, స్టోర్ రూం, ఆఫీస్ రూంగా వినియోగిస్తున్నారు. వర్షం వస్తే నీరు కిందకు చేరి చిత్తడి చిత్తడిగా ఉంటుంది. వర్షం పడిన రోజు విద్యార్థులకు జాగరణ చేయాల్సిందే. నాలుగేళ్ల క్రితం టాయిలెట్స్, బాత్‌రూమ్స్‌ను నిర్మించారు. విద్యార్థులు వినియోగించుకోకుండానే పాడైపోయాయి. రెండు సంవత్సరాల కిందట ఆ ప్రక్కనే టాయిలెట్ బ్లాక్‌ను నిర్మించారు. దీనికి బోరు, మోటారు అమర్చకపోవడంతో నిరుపయోగంగా పడి ఉంది. కాలకృత్యాలను తీర్చుకునేందుకు ఆరుబయటకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. రాత్రివేళల్లో విద్యార్థులు పడుతున్న బాధలు వర్ణనాతీతం. భవనం ద్వారం పక్కనే మూత్ర విసర్జన చేస్తుండడంతో భరించలేని దుర్వాసన వ్యాపిస్తోంది. వర్షాకాలం అయితే బురద మయంగా మారి పందులు, కుక్కలు సంచరిస్తున్నాయి. ఇనుప మంచాలు విరిగిపోవడంతో పడుకోవడానికి అనువుగా లేవు. ఆరు బయటనే స్నానాలు చేస్తున్నారు. ఫ్యాన్లు అరకొరగా ఉన్నాయి. రాత్రుళ్లు దోమల బెడదతో అనారోగ్యాల పాలవుతున్నారు. ఇది ఒక్క పెద్దపాడు బీసీ బాలుర వసతి గృహంలోనే కాదు. జిల్లాలోని చాలా వసతిగృహాల్లో ఇదే పరిస్థితి. విద్యార్థులు కనీస వసతి లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.


బురదలో నడుస్తున్న విద్యార్థులు

సమస్యల్లో సంక్షేమ హాస్టళ్లు

వార్డెన్లు స్థానికంగా నివాసం ఉండటం లేదనే..

వసతి గృహాలపై హాస్టల్ వార్డెన్ల పర్యవేక్షణ కొరవడింది. వారు స్థానికంగా నివాసం ఉండడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో ఉంటూ వచ్చివెళ్తూ విధులను నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో వార్డెన్లు అందుబాటులో లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హాస్టళ్లను తనిఖీలు చేయాల్సిన అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వసతిగృహాలను చక్కదిద్దాల్సిన అధికారులు వార్డెన్ల నుంచి విద్యార్థుల సంఖ్య ప్రకారం ఒక్కొక్క విద్యార్థికి రూ.30 నుంచి రూ.40లు ప్రతి నెలా వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. వార్డెన్లు పిల్లల కడుపులు కొట్టి కమీషన్లు ఇస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి .

జిల్లాలో 84 వసతి గృహాలు..

కర్నూలు జిల్లాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలు 84 ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో 14,500మంది బాలబాలికలు విద్యను అభ్యసిస్తున్నారు. 29 ప్రీమెట్రిక్ ఎస్సీ హాస్టళ్ల 5124లో, 8 కాలేజ్ వసతిగృహాల్లో 1157 మంది ఉన్నారు. 31 ప్రీమెట్రిక్ బీసీ హాస్టళ్లలో 5782లో 16 కాలేజీ వసతి గృహాల్లో 2300 మంది, నాలుగు గిరిజన వసతి హాస్టళ్లలో 921 మంది విద్యార్థులు ఉన్నారు.. కళాశాల వసతిగృహాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అధిక శాతం ప్రీమెట్రిక్ సొంత భవనాలైన మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరాయి,

వేధిస్తున్న ఉద్యోగుల కొరత

వసతి గృహాల్లో వాచ్‌మెన్, కుక్, కమాటీల కొరత వేధిస్తోంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉద్యోగులు లేరు. 2016 నుంచి నియామకాలు లేవు. ఉన్న వారు కూడా పదవీవిరమణ అవుతున్నారు. ప్రతి 100 మందికి ముగ్గురు ఉండాలి. వంద సంఖ్య దాటితే, ప్రతి 50మందికి అదనంగా ఒకరిని నియమించాలన్నది నిబంధనలు.


హాస్టల్ ఆవరణలో సంచరిస్తున్న పందులు


శిథిలావస్థలో టాయిలెట్ బ్లాక్


నిరుపయోగంగా మంచం

రూ.85 లక్షలతో మరమ్మతు పనులు

జిల్లాలోని 29 ప్రీమెట్రిక్ వసతిగృహాల్లో రూ.85లక్షలతో మరమ్మతుల పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులు పూర్తి చేసేందుకు సంబధిత ఇంజనీరింగ్ శాఖ అధికారులు చర్యలు




తీసుకుంటున్నారు. 2025 మార్చి నెల నుంచి డైట్ చార్జీస్ 2024 సెప్టెంబర్ నెల నుంచి కాస్మోటిక్ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయి. స్టాఫ్ కొరత ఉంది, ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ వచ్చిన తర్వాత టెక్నికల్ సమస్యలు ఉన్నాయి, లోపాలను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వార్డెన్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయంలో వాస్తవం లేదు.

- ప్రసూన, డీబీసీడబ్ల్యూవో, కర్నూలు

అంధత్వాన్ని అధిగమించి..!

- బ్రెయిలీ లిపిలో భగవద్గీత...!
- అంధత్వంలోనూ అష్టావధానంలో దిట్ట
- గీతా శ్లోకాలను అవపోసిన పట్టిన పండితుడు
- సొంతూరిలో బ్రెయిలీ భగవద్గీత ఆలయ నిర్మాణం
- అంధుల చక్రవర్తిగా రాణిస్తున్న ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న



బీటీ లక్ష్మన్న... పుట్టుకతోనే మసకబారిన కంటి చూపుతో బడి బాట పట్టాడు ఆయన. చీకటిలోనే చదువును సాగించాడు. దృష్టిలోపం ఉన్నా.. దాన్ని గుర్తించే స్థాయిలో తల్లిదండ్రులు లేకపోవడం ఒకవైపు.. కంటి చూపు సరిదిద్దుకోవాలన్న అవగాహన లేని బాల్యం మరోవైపు ఆయన్ను అలాగే పదో తరగతి వరకు నడిపించాయి. దీపం వెలుగులో దృష్టి సరిగ్గా లేక, కష్టపడి పది పరీక్షలు రాసినా ఫలితం లేకుండా పోయింది. అప్పటికే దృష్టి పూర్తిగా కోల్పోయిన ఆయన అంధుల పాఠశాల్లో చేరి, పది, ఇంటర్ ఉత్తీర్ణుడై, టీటీసీ రాసి ఉపాధ్యాయ ఉద్యోగాన్ని సాధించారు. ఆ తర్వాత అంధత్వం తన ఆశయాలకు అడ్డుకాకూడదని తలంచాడు. బ్రెయిలీ లిపిలో భగవద్గీత రాసి, లక్షలాది మంది అంధులకు గీతా సారాంశాన్ని తన పుస్తకం ద్వారా అందించాడు. అలాగే గీతలోని శ్లోకాలను అవపోసన పట్టి అంధత్వంలోనూ అష్టావధానాల్లో దిట్టగా నిలిచాడు. తన తండ్రి స్మారకార్థం స్వగ్రామంలో 'బ్రెయిలీ భగవద్గీత ఆలయం' నిర్మించి, అందులో గోమాత సమేత శ్రీకృష్ణ భగవానుడు, రాధాదేవిని ప్రతిష్ఠించాడు. సంకల్పబలం గట్టిగా ఉంటే అసాధ్యాలు సుసాధ్యాలుగా మలుచుకోవచ్చని నిరూపించాడు. ఇలా బహుముఖ రూపాల్లో రాణిస్తున్న ఆయనే ఆలూరు మండల కేంద్రానికి చెందిన బీటీ లక్ష్మన్న. ఆలూరు మండలం, హుళేబీడు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన కళ్లు ఉండి కూడా అవకాశాలు లేవని, రాలేదని నిరాశ నిస్పృహలతో ఉండే ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.

- కర్నూలు కల్చరల్ (ఆంధ్రజ్యోతి)

వివరాలు 6వ పేజీలో

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరుగుతుందని ప్రజలు ఈఅవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. తమ దరఖాస్తులు ఏదశలో ఉన్నాయో తెలుసుకునేందుకు 1100కు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు. అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఉప ప్రధాన అర్చకుడి అనుమానాస్పద మృతి

7

- సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న సూసైడ్ నోట్లు

నూతన రహదారులకు ప్రతిపాదనలు

పంచాయతీరాజ్ ఎస్ఈ రామచంద్రారెడ్డి


మాట్లాడుతున్న పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన రోడ్ల స్థానంలో నూతన రోడ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాలని పంచాయతీరాజ్ శాఖ ఎస్ఈ వి.రామచంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కర్నూలు, ఆదోని డివిజన్ల ఈఈలు, డీఈఈలు, ఏఈఈలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా శిథిలావస్థకు చేరిన రోడ్ల వివరాలను పంపాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో జనాభా ప్రాతిపదికన డబుల్ లైన్ వేయడానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రతిపాదనలు త్వరితగతిన పంపే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఆమోదం లభించిన వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సమావేశంలో కర్నూలు, ఆదోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు ఎస్‌సీఈ.మద్దన్న, డీసీ వెంకటేశ్వర్లు, డీఈఈలు, రవీంద్రారెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డి, శేషయ్య , మనోహర్, అశ్వర్థామ నాగిరెడ్డి, మహేశ్వరరెడ్డి, ఏఈఈలు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా బీటీ నాయుడు



ఆదోని, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆదోని మున్సిపల్ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్సీ బీటీ నాయుడును నియమిస్తూ ప్రభుత్వ పొలిటికల్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ప్రొటోకాల్ పాటించాలని కలెక్టర్, ఎస్పీలకు ఆదేశించారు. ఈ సందర్భంగా బీటీ నాయుడు మాట్లాడుతూ ఆదోని మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని తెలిపారు.

మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రవేశాలు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని మైనార్టీ గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపుల్లో మైనార్టీ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు లేకుండా నేరుగా అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జే.సురేష్ శనివారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, ఇతర వివరాలకు 87126 25080 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

తుంగభద్రమ్మ పరవళ్లు

- టీబీ డ్యాం నుంచి 88,530 క్యూసెక్కుల నీటి విడుదల
- మంత్రాలయానికి చేరుకున్న వరద
- మైకుల ద్వారా భక్తులను హెచ్చరిస్తున్న శ్రీమఠం అధికారులు

మంత్రాలయం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తుంగభద్రమ్మ వరదతో పరవళ్లు తొక్కుతోంది. టీబీ డ్యాం నుంచి 26 గేట్లను 3.5 అడుగుల ఎత్తులో ఎత్తి 88,530 క్యూసెక్కుల నీటిని తుంగభద్ర నదికి విడుదల చేశారు. శనివారం మంత్రాలయానికి వరద నీరు వచ్చి చేరాయి. శుక్రవారం సాయంత్రం మంత్రాలయం వద్ద 308.25 మీటర్ల నీటి మట్టంతో కేవలం 25,000 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుంది. శుక్రవారం సాయంత్రం గేట్లను ఎత్తి 88,530 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. ఇప్పటికే తుంగభద్రనది రెండువైపులా సరిహద్దులను తాకుతూ ప్రవహిస్తుంది. తహసీల్దార్ రమాదేవి, జయరామిరెడ్డి, ఆర్ఐ జనార్దన్‌రావు, వీఆర్‌వో అల్లాబకాష్, ఎస్ఐ శివాంజల్ నదీతీరాన్ని పరిశీలించారు. దర్శనార్థం వచ్చి నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు శ్రీమఠం అధికారులు మైకుల ద్వారా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. నదిఒడ్డున పుట్టీలు, గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశారు. ప్రమాదస్థాయిలో నది ప్రవహిస్తుండటంతో నదీతీర ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. పశువుల కాపరులు, చేపలు పట్టేవారు, రైతులు నదిలోకి వెళ్లొద్దని సూచించారు.


మంత్రాలయం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర

భూముల పరిశీలన

ఎకరాకు రూ.19 లక్షల నష్టపరిహారం

ఓర్వకల్లు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు విమానాశ్రయం సమీపాన విమానాశ్రయానికి అదనంగా భూములు కావాలని దరఖాస్తు చేసుకోవడంతో శనివారం కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్, తహసీల్దార్ విద్యాసాగర్ ఆ భూములను పరిశీలించారు. ఓర్వకల్లు పొలిమేరలోని 551, 552, 606, 708 వివిధ సర్వే నెంబర్లలో పట్టా భూమి 35 ఎకరాల 61 సెంట్ల భూమిని అదనంగా విమానాశ్రయానికి కేటాయించారు. పూడిచర్ల గ్రామ పరిధిలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.19లక్షలు నష్టపరిహారంగా ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు రైతులు కూడా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శంకర్ మాణిక్యం, వీఆర్వో స్వామన్న, సచివాలయ సర్వేయర్ కీర్తన పాల్గొన్నారు.


భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో సందీప్ కుమార్


నవోదయలో 9,11వ తరగతులకు దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతులకు సంబంధించి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2026-27వ విద్యా సంవత్సరానికి డ్రాపౌట్స్ సీట్ల స్థానంలో ఇతర విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఉమ్మడి కర్నూలు జిల్లా వాసులై ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, సెప్టెంబరు 29 తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేస్తుకున్న వారికి వచ్చే ఏడాది ఫిబ్రవరి ఏడో తేదీన ఎంపిక పరీక్ష ఉంటుందన్నారు. 01.06.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించిన వారై ఉండాలన్నారు. వివరాలకు విద్యాసంస్థ పనివేళల్లో 08512-294545 నంబర్‌ను సంప్రదించాలని ఆమె కోరారు.

తుంగభద్ర తీరం

సాహిత్యం

కందనవోలు శాపగ్రస్తులు



కర్నూలు కల్చరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా రైతుల దీనస్థితిని 'శాపగ్రస్తులు' కథా సంపుటి ద్వారా జిల్లా రచయితల బృందం చాలా చక్కగా వివరించింది. రైతే రాజు, రైతు లేనిదే రాజ్యమే లేదు. దేశానికి రైతు వెన్నెముక, అన్నదాత అనే మాటలు రైతులను పొగిడేందుకు బాగుంటాయి.. కానీ కరువు ప్రాంతమైన కర్నూలులో రైతుల పరిస్థితి వేరుగా ఉంది. ఈ పుస్తకంలో రైతుల కష్టాలు, బాధలు వారి జీవన పరిస్థితులు వారి పోరాటలు, అనుభవాల గురించి తెలుపుతుంది. వర్షాలు పడక, పంటలు పండక చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యలు చేసుకునే రైతులు దీనస్థితిని హృదయ విదారకంగా వివరించింది. 'ప్రాజెక్టు 1960' కథలో 'భూమమ్మను నమ్ముకున్న వాడెవడు సెడడనీ మా జేజమ్మంటుండే ఇప్పుడేమో భూమిని నమ్మినోడే సెడిపోతున్నాడు' అనే మాటలు ఆలోచనలో పడేస్తాయి. నాలుగు సంవత్సరాల్లో పూర్తి కావలసిన ప్రాజెక్టు నలభై ఏళ్లు కావడానికి కారణం ప్రభుత్వమా? ప్రజాప్రతినిధులా? అని రచయిత మనల్ని ప్రశ్నిస్తాడు. 'శాపగ్రస్తులు' అనే కథలో వానలు పడక, పంటలు పండక, వడ్డీలోళ్లకు ముఖం చూపించలేక నలిగి రైతుల ఆత్మహత్యలు చేసుకున్న తీరును చూస్తే ఏడుపు రాక మానదు. 'బాలిగన్న బతుకుబండి' అనే కథలో పశువులకు మేతలేక ఆ పశువులను అమ్ముకునేటప్పుడు చిన్న పిల్లాడికి మల్లే ఏడ్చిన లింగన్న అల్లుడి తీరు ఆవేదనను కలిగిస్తుంది. పశువులను తమ కుటుంబ సభ్యులుగా భావించిన తీరు కనపడుతుంది. రైతులకు నకిలీ విత్తనాలు, నకిలీ పురుగుమందులు అమ్మే వ్యాపారుల గురించి కూడా రచయిత చక్కగా వర్ణించాడు. 'కరువు కాటు' అనే కథలో పంట పెట్టుబడుల కోసం పశువులు, మేకలను అమ్ముకోవడం చివరకు ఆ పంట పండక పోయేసరికి ఉన్న ఊరిని విడిచి వలస వెళ్లిపోవడం గురించి వివరించారు. వలస వెళ్లిన కుటుంబాల మనుషులు చనిపోతే తమ వారిని కడసారి చూపునకు కూడా నోచుకోలేని వంటి విషయాలు హృదయ విదారకంగా ఉంటాయి.

నారాయణ అనే రైతు పంటల దిగుబడి ఎక్కువగా రావడం కోసం నకిలీ ఎరువులు, నకిలీ పురుగుమందులు వాడి నష్టపోయి అప్పు కట్టలేక చివరికి ప్రాణాలు తీసుకునే దాకా వచ్చిన స్థితిని వివరించారు. గొప్ప ఆత్మస్థైర్యం గల రైతు పిరికివాడిగా మారి ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో ఈ కథ వివరిస్తుంది. 'అలనాటి కరువు' అనే కథలో బ్రిటీష్ వారి హయాంలో వచ్చిన పెద్ద కరువుకు మనుషులను సాటి మనుషులే ఆకలికి తట్టుకోలేక తినేయడం, ఆకలికి అలమటించి కడుపున పుట్టిన పిల్లలను అమ్ముకొని పొట్టనింపుకున్న తీరును కరువు రక్కసిని చిత్రించారు. కందనవోలు గుండెల మీద ప్రవహించే తుంగభద్ర, కృష్ణ నీళ్లు మాత్రమే చాలు.. మనకు రాయలసీమను రతనాల సీమగా, సస్యశ్యామల సీమగా మర్చవచ్చు. తుంగభద్ర దిగువ కాలువ, గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకం, కేసీ కెనాల్, హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ కాలువల ద్వారానే కాకుండా వేదవతి, రాజోలిబండ డైవర్షన్ కుడి కాలువ, గుండ్రేవుల ప్రాజెక్టు కూడా పూర్తయితే పశ్చిమ కర్నూలు ప్రాంత ప్రజలు కూడా ఏ ఊరికి వలసవెళ్లి పోకుండా ఇక్కడే సంపన్నులు అవుతారన్నది కర్నూలు జిల్లా రచయితల బృందం 'శాపగ్రస్తులు' రచనలో వివరించింది.



- మానుకింది వెంకటేష్
తెలుగు ఉపాధ్యాయుడు, ఆదోని

కళా రమణుడు..!

- నాలుగు దశాబ్దాలుగా నాటక రంగంలో సుదీర్ఘ ప్రస్థానం
- టీజీవీ కల్చరల్ అకాడమీ ద్వారా నేటికీ ప్రదర్శనలు

కళ



శ్రీకృష్ణ భీమసేనమ్‌లో శకుని పాత్రలో రమణారెడ్డి

కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి యుద్ధం నాటకంలో తన తండ్రి వంగూరు రామిరెడ్డి కంఠం సర్దుకొని పద్యాలాపన చేస్తుంటే ఆ పిల్లవాడు అలా కళ్లప్పగించుకొని చూస్తూ ఉండిపోయాడు. చింతామణి నాటకంలో తండ్రి బిల్వ మంగళుడి పాత్రలో పరకాయ ప్రవేశం చేసినట్లు నటిస్తుంటే ఆ కుర్రాడు ఆ పాత్రలో లీనమై పోయాడు. ఒకటి కాదు, రెండు కాదు.. తండ్రి ఏ పాత్ర ధరించినా దానికి తగ్గ గాత్రం, పద్యాలాపన, గంభీరమైన ముఖ వర్చస్సు, అందుకు తగిన ఆహార్యంతో అశేష ప్రేక్షకాభిమానుల్ని సంపాదించుకున్నాడు. తండ్రి స్ఫూర్తితో ఎదిగిన తనయుడు కూడా నాటకం రంగం అంటేనే ప్రత్యేక అభిమానం, ఆసక్తి, అభిరుచితో తన పంతొమ్మిదేళ్ల ప్రాయంలోనే నాటక రంగంలో ప్రవేశించాడు. నాలుగు దశాబ్దాలుగా పౌరాణిక పద్య నాటక రంగ ఖ్యాతిని తన నాటకాల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా చాటి చెబుతున్నారు. ఆయనే కర్నూలు మండలం దిగువపాడుకు చెందిన వంగూరు వెంకట రమణారెడ్డి (వీవీ రమణారెడ్డి). టీజీవీ కల్చరల్ అకాడమీ సంస్థ ద్వారా నేటికీ తన 66 ఏళ్ల ప్రాయంలోనూ తరగని ఉత్సాహంతో అనేక నాటక పరిషత్తుల్లో పాల్గొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే నంది నాటక పోటీలలో నంది పురస్కారాలతోపాటూ తిరుపతి, ఒంగోలు, విజయవాడ, హైదరాబాదుల్లోని కళాపరిషత్తులలో జాతీయ పురస్కారాలు సొంతం చేసుకున్నారు.

దిగువపాడుకు చెందిన వీవీ రమణారెడ్డిది వ్యవసాయ కుటుంబం. తండ్రి వంగూరు రామిరెడ్డి రామాయణ భాగవతాదుల్ని చదివారు. తండ్రి ప్రోత్సాహంతో ఇంటర్ చదువు పూర్తయ్యాక తన 19వ ఏట శ్రీరాముని వేషం కట్టారు రమణారెడ్డి. తండ్రి దగ్గరే పాత్రల్లో నటించడం, పద్యాలు ఎలా పాడాలో నేర్చుకున్నారు. పొగాకు వ్యాపారం రీత్యా ఆయన గ్రామం నుంచి కర్నూలుకు మకాం మార్చాల్సి వచ్చింది. రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు వ్యాపారం చేసుకుంటూనే సాయంత్రం నగరంలోని లలిత కళా సమితికి వెళ్లేవారు. అక్కడ నాటి అధ్యక్షుడు థామస్‌రెడ్డి సమితిలో సభ్యత్వం తీసుకుని, నటుడిగా నాటకంలో వేషం వేయాలని ఒత్తిడి చేశారు. 1994లో అలా రూ.116 సభ్యత్వం చెల్లించి, వారు ప్రదర్శిస్తున్న 'నర నారాయణ' నాటకంలో నరుడి పాత్ర వేశారు. ఇది నంది పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా నంది బహుమతి సాధించింది. ఆ తర్వాత వరుసగా 'శ్రీకృష్ణాభిమన్యు'లో అభిమన్యుడిగా, 'మరో ప్రస్థానం' సాంఘిక నాటకంలో విలన్ పాత్రగా నటించారు. తర్వాత స్వీయ దర్శకత్వంలో 'మహారధి కర్ణ'లో కర్ణుడిగా నటించారు. ఇది వివిధ పరిషత్తుల్లో బహుమతులు సాధించింది. తర్వాత తిరుమల వేంకటేశ్వర స్వామిపై రూపొందించిన పౌరాణిక, పద్య నాటకం 'ఆనంద నిలయం' మంచి పేరు తీసుకువచ్చింది. ఇందులో రమణారెడ్డి నటించిన తొండమాన్ చక్రవర్తి పాత్రకు ప్రత్యేక గుర్తింపు లభించింది.



ఆనంద నిలయం నాటకంలో భక్తుడిగా రమణారెడ్డి



నంది అవార్డు సాధించిన రమణారెడ్డి నాటక బృందాన్ని అభినందిస్తున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్

టీజీవీ కల్చరల్ అకాడమీ నాటక సంస్థను స్థాపించి, ఆ సంస్థ ద్వారా ఏటా నాటక ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు వీవీ రమణారెడ్డి. స్వయంగా దర్శకుడైన ఆయన పద్య నాటకాల స్క్రిప్టులను సిద్ధం చేసుకొని రాష్ట్రవ్యాప్తంగా అనేక పరిషత్తుల్లో ప్రదర్శనలు ఇస్తున్నారు. అలా శ్రీ వేంకటేశ్వర మహత్యం, ఆనంద నిలయం, శ్రీకృష్ణ భీమసేనమ్ వంటి నాటకాలను ప్రదర్శించి బహుమతులు సాధించారు. ఈనెల 26న తిరుపతి అభినయ ఆర్ట్స్ సంస్థ ప్రకటించిన 'హనుమ అవార్డు'లకు శ్రీ వేంకటేశ్వర మహత్యం అనే నాటకం తిరుపతి మహతి ఆడిటోరియంలో ప్రదర్శిస్తున్నారు. అలాగే పేద వర్గాలకు చెందిన కళాకారులను గుర్తించి ఏటా సత్కరిస్తున్నారు. హార్మోనిస్టు గురువులను గుర్తించి వారికి తమ సంస్థ ద్వారా ప్రోత్సాహకాలు అందిస్తున్నారు.

నేడు టీజీవీ కళాక్షేత్రంలో 'వర్క్ ఫ్రమ్ హోమ్' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రతి నెలా చివరి ఆదివారం సాంఘిక నాటక ప్రదర్శనల్లో భాగంగా ఆదివారం రాత్రి 7 గంటలకు 'వర్క్ ఫ్రమ్ హోమ్' అనే సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపట్ల జిల్లా ద్రోణాదులకు చెందిన కళాకారులు డి.మహేంద్ర దర్శకత్వంలో ఈ నాటకం ప్రదర్శిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ నాటక ప్రదర్శనకు ముందు షాద్‌నగర్ బాలికలు టీవీ రంగయ్య దర్శకత్వం 'మాకు స్వాతంత్ర్యం కావాలి' అనే లఘు నాటిక ప్రదర్శిస్తారని, ఈ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ అంధ అష్టావధాని, ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న భగవద్గీతపై అవధానం చేస్తున్న సందర్భంగా సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

మస్టర్ల మాయాజాలానికి చెక్

- ఉదయం, సాయంత్రం హాజరు నమోదు
- వీటి ఆధారంగానే వేతనాలు చెల్లింపు
- ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

కర్నూలు అగ్రికల్చర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో మస్టర్ల(హాజరు) మాయాజాలానికి ఇక చెక్ పడనుంది. గతంలో మాదిరిగా ఫొటో తీసి పని చేయకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయే పరిస్థితులుండవు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి, ఇతర పనుల ద్వారా ఉపాధి పొందుతున్న జాబ్ కార్డులు ఉన్న శ్రామికులు (కూలీలు) ఇకపై ఉదయం, సాయంత్రం మస్టరు నమోదు చేయాలంటూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రెండు రోజుల క్రితం నీటి యాజమాన్య సంస్థ జిల్లా కార్యాలయానికి ఈ ఉత్తర్వులు అందాయి. కొత్త నిబంధనల ప్రకారం ఉదయం, సాయంత్రం పని ప్రదేశాల్లో పని చేస్తున్న వారి ఫొటోలు తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలి. ఆయా మస్టర్ల ఆధారంగా వారికి వేతన చెల్లింపులు చేయనున్నారు. అక్రమాలను నివారించడమే లక్ష్యంగా కేంద్రం ఈ విధానం అమలులోకి తెచ్చింది.



అలసత్వం వహిస్తే చర్యలు

గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద పనులు చేస్తున్న కూలీలకు సంబంధించి ఇకపై ఉదయం, సాయంత్రం వారి ఫొటోలను తీసి యాప్‌లో పంపాల్సి ఉంటుంది. ఎవరైనా అలసత్వం వహిస్తే క్షేత్ర సహాయకులపై చర్యలు తప్పవు. ఈ ఫొటోలను పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించి ఎంపీడీవోకు నివేదిక ఇవ్వాలని కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

● వెంకటరమణ,
పీడీ, నీటి యాజమాన్య సంస్థ, కర్నూలు

పాలకొలను సర్పంచ్‌కు అరుదైన గౌరవం

ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు ఆహ్వానం

ఓర్వకల్లు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఓర్వకల్లు మండలంలోని పాలకొలను సర్పంచ్ చదువుల సుజాతమ్మకు అరుదైన గౌరవం లభించింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోటలో జరిగే స్వాతంత్ర్య వేడుకలకు ఆహ్వానం అందింది. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ శనివారం అధికారికంగా వెల్లడించినట్లు పాలకొలను పంచాయతీ కార్యదర్శి రవికుమార్ తెలిపారు. ఢిల్లీలో జరిగే పంద్రాగస్టు వేడుకలకు రాష్ట్రంలో పది మందిని ఎంపిక చేయగా.. వారిలో కర్నూలు జిల్లా నుంచి సర్పంచ్ చదువుల సుజాతమ్మ ఎంపికయ్యారు. సర్పంచ్ సుజాతమ్మ మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, ప్రజా సౌకర్యాలు, పారిశుధ్యం తదితర విభాగాల్లో కృషి చేయడంతోనే ఈ అవకాశం దక్కిందన్నారు. ఇంత గొప్ప అవకాశం లభించడంలో మండల, గ్రామ అధికారులు పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజల సహకారం కారణం అన్నారు. స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొనే అవకాశం దక్కినందుకు ప్రభుత్వానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.



చదువుల సుజాతమ్మ

మహానందిలో రాష్ట్ర హైవేస్ ఎస్ఈ పూజలు

మహానంది, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో రాష్ట్ర హైవేస్ ఎస్ఈ శ్రీనివాసరెడ్డి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయం ముఖద్వారం వద్ద ఏఈవో యర్రమల్ల మధు ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఈ ప్రధాన ఆలయాల్లో స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు చేశారు. వేద ఆశీర్వచన మంటపంలో వేదపండితులు శాలువాతో సన్మానించి, ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట కర్నూలు ఆర్అండ్‌బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, నంద్యాల ఈఈ శ్రీధర్‌రెడ్డి ఉన్నారు.



శ్రీనివాస రెడ్డిని సన్మానిస్తున్న వేద పండితులు

అంధత్వాన్ని అధిగమించి..!



కుమార్తెలు రాజేశ్వరి, యోగేశ్వరితో బీటీ లక్ష్మన్న

కళ్లు కనిపించని వారికి, అంధత్వాన్ని అడ్డుగా భావించే వారికి హులేబీడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న అభినవ బ్రెయిలీ అయ్యారు. కేవలం స్పర్శతోనే అక్షరాలను గుర్తుపట్టి అంధులకు భగవద్గీతను తెలుసుకునేలా చేస్తున్నారు ఆయన. జీవితంలో ఎన్నో కష్టాలను, ఒడిదుడుకులను ఎదుర్కొని ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. ఎవరూ చేయని సాహసం చేసి బ్రెయిలీ లిపిలో భగవద్గీతను లిఖించి చీకటిని జయించారు. అక్షరాలను చుక్కల కూర్పుతో అంధులు గుర్తుపట్టేలా ఆయన రాసిన బ్రెయిలీ లిపిపై సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

- కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి)

బాల్యం.. విద్యా జీవితం.. ఉద్యోగ ప్రస్థానం

ఆలూరు మండల కేంద్రానికి చెందిన నర్సమ్మ, హనుమన్న దంపతులకు రెండో సంతానంగా బీటీ లక్ష్మన్న 1971 జూన్ 1న జన్మించారు. వ్యవసాయ ఆధారిత కుటుంబంలో పుట్టిన లక్ష్మన్న ప్రాథమిక విద్య ఆలూరులోని ఆది ఆంధ్ర పాఠశాల్లో సాగింది. అప్పటికే 20 శాతం దృష్టిలోపం ఉన్నా, దాన్ని తల్లిదండ్రులు గుర్తించలేదు. తాను కూడా కనిపించే ప్రపంచం ఇలాగే ఉంటుందన్న భావంతో ఉండిపోయాడు. 1985లో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల్లో పది పరీక్షలు రాశాడు. అప్పటికే దృష్టిలోపం బాగా పెరిగిపోయింది. ఇంట్లో దీపం వెలుగులోనే చదువుకోవాల్సి వచ్చేది. అలా తన అంధత్వానికి చిమ్మ చీకటి మరింత చూపు కోల్పోయేలా చేసింది. దీంతో పది పరీక్ష ఉత్తీర్ణత కాలేకపోయారు. దీంతో దిగులుతో ఉన్న ఆయన్ని పాఠశాల సంగీతం మాస్టారు సుబ్బరాయుడు హైదరాబాదులోని అంధుల పాఠశాలలో చేరమని సలహా ఇచ్చారు. అలా 1987లో పది ఉత్తీర్ణత సాధించి, 1988లో అక్కడి చంచలగూడ జూనియర్ కళాశాల్లో ఇంటర్ విద్య పూర్తి చేశారు. 1990-91లో నేరేడుమెట్ట ప్రభుత్వ టీటీసీ కళాశాల్లో సీటు సాధించి, టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేశారు. 1992లో హైదరాబాదులోనే బ్రెయిలీలో డిప్లమో పాసయ్యారు. 1993లో ఉపాధ్యాయునిగా ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ఆలూరు మండలం, మాసనపల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల్లో విధుల్లో చేరారు.



గతేడాది ఆగస్టు 25న ఆలూరు న్యాయాధికారి హేమ చేతుల మీదుగా బ్రెయిలీ లిపి భగవద్గీత ఆవిష్కరణ

అంధత్వంలోనూ అద్భుతమైన అష్టావధానం

గీతా సారాంశాన్ని అవపోసన పట్టిన బీటీ లక్ష్మన్న భగవద్గీతపై ఇప్పటి వరకు ఎన్నో అష్టావధానాలు నిర్వహించారు. అలాగే ఇప్పటి వరకు 79 గీతా జ్ఞాన యజ్ఞములు (భగవద్గీత శ్లోకాల సారాంశాన్ని తెలియజేసే కార్యక్రమాలు) నిర్వహించారు. తన తండ్రి స్మారకార్థం ఆలూరు మండల కేంద్రంలో స్వంత ఖర్చుతో 'బ్రెయిలీ భగవద్గీత ఆలయం' నిర్మించారు. ఇందులో గోమాత సమేత శ్రీకృష్ణ భగవానుడు, రాధ విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ ఆలయం ద్వారా ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. బీటీ లక్ష్మన్న 2005లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికయ్యారు. 2012లో కర్నూలులో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల్లో బ్రెయిలీ భగవద్గీత రాసిన సందర్భంగా నాటి రాష్ట్ర మంత్రి టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం పొందారు. అలాగే సావిత్రీబాయి పూలే అవార్డు, ఉగాది ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారు. బాల్యంలో తనకు ఉన్న ఐదు సంకల్పాల్లో ఉపాధ్యాయ ఉద్యోగం, శ్రీకృష్ణ మందిరం నిర్మాణం, బ్రెయిలీ లిపిలో గీతా ముద్రణ వంటిని పూర్తయ్యాయని, బ్రెయిలీ లిపిలో బైబిల్, ఖురాన్ గ్రంథాలను రాసేందుకు సిద్ధపడుతున్నానని చెప్పారు. బైబిల్, ఖురాన్ గ్రంథాల పఠనంలో నిష్ణాతులైన వారు తనకు లభిస్తే ఈ రెండు గ్రంథాలను కూడా పూర్తి చేస్తానని ఆయన చెబుతున్నారు. అలాగే ఉద్యోగ విరమణ అనంతరం అంధులకు ఆశ్రమ నిర్మాణం, తపస్సుతో కూడిన జీవితాన్ని ఆస్వాదించడం తన లక్ష్యంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ అనుమతితో కర్నూలులోని నవభారత్ బీఎడ్ కళాశాల ద్వారా బీఎడ్ చదువుతున్న ఆయన యువతకు స్ఫూర్తిగా అనేక కార్యక్రమాలను చేపట్టే ఆలోచన ఉందని పేర్కొన్నారు. యువత ఆత్మవిశ్వాసంతో ముందుకుపోతే సాధ్యం కానిది అంటూ ఏదీ లేదని ఆయన చెబుతున్నారు.

- బ్రెయిలీ లిపిలో భగవద్గీత...!
- అంధత్వంలోనూ అష్టావధానంలో దిట్ట
- గీతా శ్లోకాలను అవపోసన పట్టిన పండితుడు
- సొంతూరిలో బ్రెయిలీ భగవద్గీత ఆలయ నిర్మాణం
- చీకటి చక్రవర్తిగా రాణిస్తున్న ప్రధానోపాధ్యాయుడు బీటీ లక్ష్మన్న

అభినవ బ్రెయిలీ

ఐదేళ్లు కష్టపడి బ్రెయిలీ లిపిలో భగవద్గీత

దృష్టిలోపం నుంచి పూర్తి అంధత్వం వచ్చాక బీటీ లక్ష్మన్న కుమిలిపోలేదు. పైగా తనలోని సామర్థ్యాలకు సానపట్టి, అసాధ్యాలను సుసాధ్యం చేయాలని బలంగా సంకల్పించుకున్నాడు. ప్రతిభకు కొలమానాలు ఏవీ లేవని నిరూపించాలని భావించాడు. తనకు ఇష్టమైన దేవుడు కృష్ణభగవానుడిని నిత్యం ఆరాధించే బీటీ లక్ష్మన్నకు ఒకరోజు కలలో కృష్ణభగవానుడే స్వయంగా వచ్చి తన భగవద్గీతను అంధులకు కూడా అర్థం అయ్యేలా రాయాలని బోధించాడని ఆయన చెబుతుంటారు. దీంతో బాగా ఆలోచించి ఇప్పటి వరకు ఎవరూ చేయని ఈ ప్రయత్నాన్ని తాను ఎందుకు చేయకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 1995లో ఆలూరు జూనియర్ కళాశాల్లో పనిచేస్తున్న తెలుగు అధ్యాపకుడు వరప్రసాద్ సహాయంతో ఆయన భగవద్గీత శ్లోకాలు చెబుతుండగా, ఆ శ్లోకాలు, వాటికి ప్రతి పదార్థములు, తాత్పర్యాలు రాశారు. అలా గీతలోని మొత్తం 701 శ్లోకాలు పూర్తి చేసేందుకు ఐదేళ్ల సమయం పట్టింది. 2000సంవత్సరంలో 'బ్రెయిలీ లిపిలో భగవద్గీత' పుస్తకాన్ని ఆయన అంధుల ముందుకు తీసుకువచ్చారు.





అప్పటి మేయర్, జేసీ, మంత్రి కేఈ ప్రభాకర్ నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును స్వీకరిస్తూ

వాత్సల్యమూర్తులు

- పిల్లల సంతోషమే కోసమే..
- పాశ్చాత్య పోకడలతో తల్లిదండ్రులపై తగ్గుతున్న ఆప్యాయత
- వృద్ధులకు అండగా నిలిచిన దేశ అత్యున్నత న్యాయస్థానం
- నేడు జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం



అమృతాన్ని పంచేది అమ్మ. అనురాగాన్ని అందించేది నాన్న. తల్లిదండ్రులు పంచే ఆప్యాయత భూప్రపంచంలోనే వెలకట్టలేనిది. మనిషి జీవితంలో ఎంతో ప్రాముఖ్యత కలిగిన తల్లిదండ్రుల పాత్రను వివరిస్తూ జూలై 4వ ఆదివారాన్ని తల్లిదండ్రుల దినోత్సవంగా జరుపుకోవడం సాంప్రదాయంగా కొనసాగుతోంది. 1994లో అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ ఫాదర్స్‌డే, మదర్స్‌డేలను రద్దు చేసి తల్లిదండ్రుల విషయంలో లింగబేధం ఉండరాదన్న ఉద్దేశ్యంతో తల్లిదండ్రుల దినోత్సవాన్ని నిర్వహించాలని తీర్మానించగా ఆదేశ సుప్రీం కోర్టు ఇందుకు అంగీకరించింది. మనదేశంలో కూడా జూలై 4వ ఆదివారాన్ని తల్లిదండ్రుల దినోత్సవంగా జరుపుకుంటున్నారు. జాతీయ తల్లిదండ్రుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' పాఠకుల కోసం ప్రత్యేక కథనం.

ఆత్మకూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మమతానురాగాలకు ప్రతిరూపాలు తల్లిదండ్రులు. సమాజంలో తల్లిదండ్రులకు ఉన్నతమైన పాత్ర ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు నేర్పించాల్సిన కనీస విషయాలను తెలియపర్చాల్సిన అవసరం ఉంది. సమాజంలో తల్లిదండ్రులకు, గురువులకు, కుటుంబానికి, మన చుట్టూ వుంటే బాహ్య ప్రపంచానికి ఏరకమైన గౌరవాన్ని అందించాలన్న విషయాలను పిల్లలకు చిన్నతనం నుంచే నేర్పించాలి. ఇంట్లో ఎవరైనా వృద్ధులు ఉంటే వారిపై చూపించాల్సిన ప్రేమానురాగాలను పిల్లలు గ్రహించే సేవలు అందించాలి.

ప్రతి ఒక్కరూ బాధ్యతగా..

వృత్తి, సామాజిక, ఆర్థిక పరంగా అనే ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నప్పటికీ జీవిత చరమాంకంలో తల్లిదండ్రులపై ప్రతిఒక్కరూ బాధ్యతగా మెలగాలి. వృద్ధాప్యంలో ఒక తోడుకోసం.. ఓ తియ్యని మాట కోసం అల్లాడిపోయే తల్లిదండ్రులకు అప్యాయతను పంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తల్లిదండ్రుల దినోత్సవ ప్రాముఖ్యతను తెలుసుకుని ప్రతి ఒక్కరూ అమృతమూర్తులైన అమ్మనాన్నల పట్ల ఆదరణ చూపుతారని ఆశిద్దాం.

వృద్ధులకు అండగా..

భారతదేశ సమాజంలో ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో చిన్నకుటుంబాలు ఎక్కువై పోయాయి. దేశవ్యాప్తంగా ఇలాంటి పరిస్థితి అధికం కావడంతో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంది. సంపాదన లేని తల్లిదండ్రులు, వృద్ధుల సంరక్షణ, పోషణ కోసం చొరవ తీసుకుంది. ఇందుకుగానూ 2007లో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా మెయిన్‌టెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరేంట్ అండ్ సీనియర్ సిటిజన్స్ యాక్ట్-2007 పేరుతో ఓ చట్టాన్ని ప్రవేశపెట్టింది.



తల్లిదండ్రులను పట్టించుకోకపోవడం..



తల్లిదండ్రులను చరమాంకంలో కంటిరెప్పలా సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపైనే ఉంది. ఇటీవల తల్లిదండ్రులను పిల్లలు పట్టించుకోని సంఘటనలు చోటుచేసుకోవడం బాధాకరం. తల్లిదండ్రులను గౌరవించే విధానాలు చిన్నతనం నుంచే పిల్లలు అలవర్చుకోవాలి.

● నాగరాజు, హెచ్‌ఎం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆత్మకూరు

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలు



తమకు జీవితాన్ని ప్రసాదించిన తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవమన్న విషయాన్ని పిల్లలు గుర్తించాలి. పిల్లలు ఉన్నత స్థితికి చేరుకోవడానికి తల్లిదండ్రులు పడే తపన అంతాఇంతా కాదు.

● గరుడాద్రి సత్యనారాయణశర్మ, పురోహితులు, ఆత్మకూరు

మార్కెట్ యార్డుకు రోడ్డు ఏర్పాటు చేస్తాం

- సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి

కర్నూలు అగ్రికల్చర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డులోని కూరగాయల మార్కెట్ నుంచి మెయిన్ రోడ్డుకు త్వరలోనే రహదారి ఏర్పాటుచేస్తామని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. మార్కెట్ యార్డుకు వెళ్లే భారీ వాహనాల రాకపోకలపై సమీపంలోని నివాసితులు అభ్యంతరాలను వ్యక్తంచేశారు. శనివారం సమస్యను సమగ్రంగా అర్థం చేసుకోవడానికి సంబంధిత ప్రాంతంలో కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించినట్లు ఆమె తెలిపారు. అనంతరం జయలక్ష్మి మాట్లాడుతూ కలెక్టర్, ఎస్పీ, జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, మార్కెట్ కమిటీ అధికారులు, రెవెన్యూ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఒక సమావేశాన్ని త్వరలోనే నిర్వహిస్తామన్నారు. వాస్తవ పరిస్థితుల ఆధారంగా రైతులు, స్థానికుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.

కొండ ముచ్చుల దాడి

- పలువురికి గాయాలు
- భయాందోళనలో జలదుర్గం గ్రామస్థులు

ప్యాపిలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జలదుర్గం గ్రామంలో గత రెండు రోజులుగా కొండ ముచ్చులు దాడిచేస్తున్నాయి. ఈదాడిలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బయటికి పోవాలంటే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. జలదుర్గంలో నెల రోజులుగా కొండ ముచ్చుల సంచారం అధికంగా మారింది. సమీపంలోని కొండ ప్రాంతం నుంచి గ్రామంలో వస్తున్నాయి. మిద్దెల మీద, పొలాల్లో వీటి సంచారం అధికంగా మారింది. రెండు రోజులుగా ఉమా, నాగిరెడ్డి, శోభ, ఓబులేసు, రామానాయుడు తదితరులపై కొండముచ్చులు దాడి చేసి గాయపరిచాయి. అటవీ శాఖ అధికారులు స్పందించి కొండ ముచ్చులను పట్టుకొని అడవిలో వదలాలని స్థానికులు కోరుతున్నారు.

ఉప ప్రధాన అర్చకుడి అనుమానాస్పద మృతి

- సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్న సూసైడ్ నోట్లు




పూజన్న స్వామి(ఫైల్)

ఎమ్మిగనూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ ఉప ప్రధాన అర్చకుడు పూజన్న స్వామి(47) మృతి అనుమానాస్పదంగా మారింది. మొదట గుండెపోటుతో మృతి చెందినట్లు ప్రచారం జరిగింది. సోషల్ మీడియాలో మాత్రం పూజన్నస్వామి ఆలయ ఉన్నతాధికారుల, ప్రధాన అర్చకుల, వేదపండితులు వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు రెండు సూసైడ్ నోట్లు వైరల్ అవుతున్నాయి. ఆలయంలో అనేక సమస్యలు ఉన్నాయని, అర్చకులను చులకనగా చూస్తున్నారని, ఉన్నతాధికారులకు తనపై ఫిర్యాదులు చేసి అధికారం చెలాయిస్తున్నారని, తనపై కక్ష సాధింపు చేస్తున్నారని రాసి ఉంది. ప్రాణార్పణ చేసుకుంటున్నాను నన్ను క్షమించండి అని రెండు సూసైడ్ నోట్లలో రాయటం అనుమానాలకు బలం చేకూరుతోంది. పూజన్నస్వామి గుండెపోటుతో మృతి చెందాడా? వేధింపులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నారా? అనే అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యులు మాత్రం ఆయన మృతిపై ఎలాంటి అనుమానాలను వ్యక్తం చేయటంలేదు. పూజన్న స్వామి మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని స్థానికులు చెబుతున్నారు. ఈవిషయంపై సీఐ అశోక్ కుమార్‌ను వివరణ కోరగా కుటుంబ సభ్యులనుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. సూసైడ్ నోట్లు ఆయన సొంతంగా రాశారని చెప్పడానికి ఎలాంటి ఆధారాలు లేవు. గిట్టని వారు రాసి ఉండవచ్చు కదా అన్నారు. ఆలయ ఈవో విజయరాజ్‌ను వివరణ కోరగా ఆయనపై నాకు ఎలాంటి కక్ష సాధింపు లేదన్నారు. ప్రధాన అర్చకుడు, వేదపండితులు మధ్య వ్యక్తిగత అభిప్రాయ భేదాలు ఉండే విషయం నాకు తెలియదు. దేవదాయశాఖ నిబంధనల మేరకు గర్భగుడిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కోవెలకుంట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. వివరాలు.. మండలంలోని కలుగొట్లకు చెందిన సుదర్శన్‌రెడ్డి(40), క్రిష్ణవేణి దంపతులు. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. 12 సంవత్సరాల క్రితం భార్య క్రిష్ణవేణి అనారోగ్యంతో మృతి చెందింది. పిల్లలను బంధువుల వద్ద వదిలి సుదర్శన్‌రెడ్డి ఒంటరి జీవితం గడిపేవాడు. 15 రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. ఆస్పత్రికి వెళ్లి చూపించగా కిడ్నీలు చెడిపోయాయని వైద్యులు తెలిపారు. దీంతో జీవితంపై విరక్తి చెందిన సుదర్శన్‌రెడ్డి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తండ్రి నాగేశ్వర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమ పేరుతో మోసపోవద్దు : డీఎస్పీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్పీ

ఆదోని రూరల్, జూలై 26 (ఆంధ్ర జ్యోతి): ప్రేమ పేరుతో మోసపోయి వంచనకు గురికావద్దని ఆదోని డీఎస్పీ హేమలత విద్యార్థినులకు సూచించారు. శనివారం రూరల్ సీఐ నల్లప్ప, ఎస్ఐ రామాంజనేయులుతో కలిసి ఆరేకల్లు బాలికల పాఠశాలలో సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలు వద్దని సూచించారు. బలవన్మరణాలకు పాల్పడవద్దని, సైబర్ నేరగాళ్ల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండి, ఉన్నతంగా చదివి పాఠశాల, తల్లిదండ్రులు, గ్రామానికి పేరు తీసుకొని రావాలన్నారు. ఏదైనా సమస్య వస్తే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు.

గిరిజన పాఠశాల విద్యార్థులకు అస్వస్థత

- పాణ్యం సీహెచ్‌సీకి తరలింపు
- పాఠశాలను పరిశీలించిన ఐటీడీఏ పీవో, అధికారులు



పాణ్యం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



మురుగు కాల్వలో తాగునీటి పైపులైను

పాణ్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు శనివారం అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగించింది. విద్యార్థులు విరేచనాలు, తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా అధికారులు పాణ్యం సీహెచ్‌సీకి తరలించారు. దీంతో అప్రమత్తమైన డీటీడబ్ల్యూఓ, శ్రీశైలం ఐటీడీఏ పీవో వెంకటశివప్రసాద్, జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ, ఏఎస్పీ జావలి ఆల్ఫోన్స్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ కోటయ్య పాణ్యంకు వెళ్లారు. పాఠశాలను పరిశీలించి, విద్యార్థులను పరామర్శించారు. విద్యార్థుల్లో ఇద్దరి పరిస్థితి ఇబ్బందికరంగా ఉండటంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులు అస్వస్థత కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. తాగునీరు కలుషితం అయ్యాయన్న కారణంగా నీటి శ్యాంపిళ్లను నంద్యాల పరీక్ష కేంద్రానికి పంపారు.

నెల రోజుల క్రితం మారిన విద్యార్థులు

పాణ్యం గురుకుల పాఠశాల భవనంలో ఉంటున్న 218 మంది విద్యార్థులు అరకొర వసతులతో విద్యనభ్యసిస్తున్నారు. కాగా నెల రోజుల క్రితం డ్రైనేజీ కారణంగా నెరవాడ మెట్ట సమీపంలోని గిరిజన మినీ గురుకుల పాఠశాల భవనంలోకి మార్చారు.

ఈ పాఠశాల పక్కనే మురుగుగా ప్రవహిస్తున్న ఎస్సార్బీసీ కాలువలోనే విద్యార్థులకు అందించే తాగునీటి పైపులైను ఉండడం గమనార్హం. ఈ పైపులైను లీకేజీల వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. కాగా పాణ్యంలో పాఠశాల భవనం నుంచి వెలువడే మురుగు నీరు బయటకి వెళ్లడానికి గత ఏడాది నుంచి ప్రిన్సిపాల్ కృష్ణానాయక్ కలెక్టరు, ఎమ్మెల్యే, పీఓలకు వినతిపత్రాలు అందజేస్తూ వచ్చారు. ఈ క్రమంలో నెలరోజుల క్రితం విద్యార్థులను నెరవాడ మెట్ట సమీపంలోని మినీ గురుకులం భవనానికి తరలించారు.

ఈ భవనంలో మూడు మరుగుదొడ్లు ఉండడంతో 218 విద్యార్థులకు సరిపోకపోవడంతో వారు బయటకు వెళ్తున్నారు. అపరిశుభ్ర వాతావరణం కూడా అస్వస్థతకు కారణమని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా మినీ గురుకులంలో మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని డిమాండ్లు ఉన్నప్పటికీ ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోలేదు.

అస్వస్థతకు అధికారుల నిర్లక్ష్యమే కారణం

విద్యార్థులు అస్వస్థతకు గురికావడానికి అధికారులే కారణం. ఏడాదిగా డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదు. మురుగుకాలువ వెళ్లే స్థలం ప్రభుత్వానిది కాగా ఈ స్థలం ఆక్రమణకు గురైనా పట్టించుకోకపోవడం అధికారుల నిర్లక్షానికి నిదర్శనం. అస్వస్థతకు గల కారణాలను విశ్లేషించి మళ్లీ ఈ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి. మినరల్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేసి నాణ్యమైన తాగునీరందించాలి.

- దేవదానం, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడు

మెనూ ప్రకారమే ఆహారం పంపిణీ

మెనూ ప్రకారమే ఆహారం అందించాం. శుక్రవారం సాయంత్రం కారం బొరుగులు, రాత్రి అన్నం, సాంబారు, శనివారం ఉదయం ఇడ్లీ, చట్నీ అందించాం. తాగునీరు బోరునుంచి వచ్చే నీటిని పంపిణీ చేస్తున్నాం. పాణ్యంలో పాఠశాల నుంచి వెలువడే మురుగు నీరు నిల్వకు అనువైన ప్రాంతం లేకపోవడంతో నెరవాడ మెట్ట సమీపంలోని మినీ గురుకుల భవనానికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మార్చాం. కలుషిత నీరే కారణమన్నది నీటి పరీక్షల అనంతరం తెలుస్తుంది. విద్యార్థులకు అనువైన మరుగుదొడ్లు లేవు. **- కృష్ణానాయక్, ప్రిన్సిపాల్**

రెండు రోజుల్లో సమస్య పరిష్కారం

రెండు రోజుల్లో మౌలిక సదుపాయాలు, తాగునీరు అందించేలా చర్యలు చేపడతాం. పాణ్యంలోని మురుగుకాల్వ సమస్యను పరిష్కరిస్తాం. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టాం. గురుకుల పాఠశాలకు మంజూరైన భవన నిర్మాణానికి చర్యలు చేపడతాం. **- వెంకటశివప్రసాద్, డీటీడబ్ల్యూఓ**

ఎంఈవో, హెచ్‌ఎం పోస్టుల భర్తీ



నంద్యాల ఎడ్యుకేషన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాల్లో మండల విద్యాశాఖాధికారుల పోస్టులను భర్తీ చేస్తూ ఆర్జేడీ శ్యామ్యూల్ ఉత్తర్వులు జారీచేశారు. ఎంఈవోలుగా కొనసాగుతూ ఇటీవల రిటైర్ అయిన వారి స్థానాలతో పాటు ఒకరికి రెండు పదవులు లేకుండా పూర్తిస్థాయిలో ఎంఈవో పోస్టులను గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేశారు. కర్నూలు జిల్లా కృష్ణగిరి ఎంఈవో-2గా పనిచేస్తున్న మద్దయ్య గత నెలలో రిటైర్డ్ కాగా ఆ స్థానంలో కోయిలకొండలో జడ్పీ పాఠశాల హెచ్‌ఎం మైఖేల్‌ను నియమించారు. కొలిమిగుండ్ల ఎంఈవో-1గా, ఎఫ్ఏసీపై సంజామల ఎంఈవో-1గా పనిచేస్తున్న రాజయ్య ఈ నెలాఖరులో పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో బనగానపల్లె ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామకృష్ణయ్యను కొలిమిగుండ్ల ఎంఈవోగా-1గా, సంజామల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రమణారెడ్డిని సంజామల ఎంఈవో-1గా నియమించారు. పగిడ్యాల ఎంఈవో-1గా, నందికొట్కూరు ఎంఈవో-1 ఎఫ్ఏసీగా పనిచేస్తున్న సుభాన్‌ను నందికొట్కూరు ఎఫ్ఏసీని తప్పించి నందికొట్కూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం రామిరెడ్డిని ఎంఈవో-1 గా నియమించారు. కొత్తపల్లె మండల ఎంఈవోగా ఆత్మకూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం నాగరాజును, సున్నిపెంట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం మేరీ మార్గరేట్‌ను ఆత్మకూరు ఎంఈవో-1గా, తిమ్మాపురం పాఠశాల హెచ్‌ఎం విజయకుమార్‌ను మహానంది ఎంఈవో-2గా, ఏనుగుల మర్రి జడ్పీ పాఠశాల హెచ్‌ఎం రఘునాయక్‌ను డోన్ ఎంఈవో-2గా నియమించారు.

ఎస్ఏలతో హెచ్‌ఎం పోస్టుల భర్తీ

ఉమ్మడి జిల్లాల్లో ఖాళీగా ఉన్న పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లతో భర్తీ చేశారు. ఆళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాల గణితం ఉపాధ్యాయులు శేషశయనా రెడ్డిని అదే పాఠశాల హెచ్‌ఎంగా నియమించారు. గడిగరేవుల పాఠశాల హెచ్‌ఎంగా చంద్రావతి, తిమ్మాపురం జడ్పీ పాఠశాల హెచ్‌ఎంగా చంద్రశేఖర్‌రెడ్డి, సంజామల ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా షబ్బీర్ హుస్సేన్, ఆత్మకూరు జడ్పీ ఉర్దూ హైస్కూల్ హెచ్‌ఎంగా మోహన్‌బాబు, ఆత్మకూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా దేవనాథన్ నియమితులయ్యారు. అలాగే నందికొట్కూరు ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా సిద్ధయ్య, కలమందలపాడు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా రమేష్‌కుమార్, సున్నిపెంట ప్రభుత్వ ప్రాజెక్టు హైస్కూల్ హెచ్‌ఎంగా పద్మావతి, బనగానపల్లె ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎంగా శ్రీనివాసులు, ఏనుగుమర్రి జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా రాజశేఖర్‌ను నియమించారు.

కార్గిల్ వీరుల త్యాగాలు మరువలేనివి

- కలెక్టరేట్ ఎదుట అమరులకు నివాళి



కలెక్టరేట్ ఎదుట కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

కర్నూలు స్పోర్ట్స్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని పలువురు మాజీ సైనికులు కొనియాడారు. శనివారం అమరులైన జవాన్ల త్యాగాలను స్మరించుకుంటూ నగరంలో ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ గాంధీ విగ్రహం ముందు జిల్లా మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య చౌదరి, బాబురాజు, నాగేశ్వరరావు, శర్మ శేషం రాజు, మున్నీరు రాజారెడ్డి, కృష్ణయ్య, మాజీ సైనికులతో కలిసి కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 26న కార్గిల్ విజయ్ దివస్ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అంతకుముందు కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న జవానులు నర్రా పేరయ్య, సెక్రటరీ ఎం.సుధాకర్, ట్రెజరర్ నజీర్ అహ్మద్, డోన్ రాముడు, ఆత్మకూరు సింగ్, మరి కొంతమంది మాజీ సైనికులకు జిల్లా సైనిక్ బోర్డు సభ్యులు సన్మానించారు.

ఉభయ సభల సంయుక్త కమిటీల చైర్‌పర్సన్‌గా గౌరు చరిత



కల్లూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత ఆంధ్రప్రదేశ్ శాసనసభ, శాసన మండలి సభ్యులతో 2025-26 ఏడాదికి ఉభయ సభల సంయుక్త కమిటీల చైర్‌పర్సన్‌గా ఎంపికయ్యారు. ఈమేరకు శనివారం కూటమి ప్రభుత్వం కమిటీ జాబితాను విడుదల చేసింది. మహిళ, శిశు సంక్షేమ, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్‌గా ఎమ్మెల్యే గౌరుచరితను నియమించారు. కమిటీ సభ్యులుగా గల్లా మాధవి, డాక్టర్ దసరి సుధ, నులవల విజయశ్రీ, పరిటాల సునీతమ్మ, పల్లె సింధూరారెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, లోకం నాగ మాధవి, పరుపుల సత్యప్రభ, టి.కల్పలత, కావలి గ్రీష్మప్రసాద్, డా.ఏ మధుసూదన్ ఉన్నారు.

'దూదేకుల కార్పొరేషన్' ఏర్పాటు హర్షణీయం

- క్రమ శిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా



కర్నూలు అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నూర్ బాషా దూదేకుల సంక్షేమం కోసం ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు నిర్ణయంపై రాష్ట్ర నూర్ బాషా (దూదేకుల) సంఘం క్రమ శిక్షణా కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్ బాషా హర్షం వ్యక్తం చేశారు. శనివారం ఆయన కర్నూలులో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో వెనుక బడిన నూర్ బాషా దూదేకుల సామాజిక వర్గానికి న్యాయం చేయడం కోసం ప్రత్యేకంగా ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటుకు నిర్ణయించడం పట్ల రాష్ట్రంలోని దూదేకుల కులస్తులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగిందని తెలిపారు. తరతరాలుగా అన్ని రంగాల్లో వెనుకబడిన దూదేకుల కులస్తులకు తెలుగుదేశం హయంలో ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి అవకాశం ఏర్పడిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తమ కులస్తులకు తీపి కబురు లాంటిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వానికి రాష్ట్రంలోని 18లక్షల దూదేకుల కులస్థులు అండగా ఉన్నందుకు చంద్రబాబు రుణం తీర్చుకున్నారన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు రేషన్ పంపిణీ


రేషన్ అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

కర్నూలు కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): 65 సంవత్సరాలు పైబడిన రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం ప్రతి నెలా 26వ తేదీ నుంచే వారి ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేస్తామన్నారు. శనివారం నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలోని వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి జేసీ రేషన్ పంపిణీ చేశారు. డీఎస్‌వో రాజా రఘువీర్ పాల్గొన్నారు.

పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి


మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు సాగు చేసిన పొగాకును ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కేకే భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గత రెండేళ్ల నుంచి రైతులు పొగాకును విస్తారంగా సాగు చేస్తున్నారని అన్నారు. గతేడాది రేటు బాగా పలకడంతో రైతులు పొగాకు పంట వైపు మళ్లారని అన్నారు. ఈ సంవత్సరం అత్యధికంగా రైతులు పొగాకు పంట సాగు చేయ డం వల్ల కంపెనీ ప్రతినిధులు రేటు పూర్తిగా తగ్గించారని అన్నారు. గతంలో రూ.18 వేలు ఉండగా ప్రస్తుతం రూ.15వేలు ఇస్తామని చెప్పడం దారుణమన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి రామక్రిష్ణ ఉన్నారు.

'క్వాంటం'తోనే ఉజ్వల భవిష్యత్తు


విద్యార్థికి పట్టాను అందజేస్తున్న అనంతపురం జేఎన్‌టీయూ ఉపకులపతి సుదర్శన్‌రావు

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): క్వాంటం కంప్యూటింగ్‌తోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని అనంతపురం జేఎన్ టీయూ ఉపకులపతి సుదర్శన్‌రావు పేర్కొన్నారు. శనివారం స్థానిక జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలలో నాలుగో స్నాతకోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి అనంతరం జేఎన్‌టీయూ ఉపకులపతి హెచ్.సుదర్శన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై 2021-25 బ్యాచ్ బీటెక్ 2023-25 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య, కళాశాల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్స్, డీన్స్, వివిధ విభాగాధిపతులు, ప్రొఫెసర్లు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగులో భూసార పరీక్షలు కీలకం

కోడుమూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): పంట సాగులో భూసార పరీక్షలు ఎంతో కీలకమని డీఆర్సీ ఏడీఏ వెంకటేశ్వర్లు అన్నారు. మండ లంలోని పులకుర్తిలో శనివారం ఆత్మ సౌజన్యంతో పంటల సాగుపై రైతుల కు శిక్షణ ఇచ్చారు. ఏడీఏ మాట్లాడుతూ అవసరానికి మించి రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. పురుగు మందులకు బదు లుగా వేపనూన్, కషాయాలను వినియోగించి పెట్టుబడి వ్యయం తగ్గిం చుకోవాలన్నారు. అలాగే విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం రైతులకు పంటల సమగ్ర సమాచార కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏవో రవిప్రకాష్, హెచ్‌వో మదన్‌మోహన్ పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో జిల్లా బాస్కెట్‌బాల్ సంఘం ప్రతినిధి దాదా బాషా ఆధ్వర్యం లో జిల్లా స్థాయి బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలు శనివారం ప్రారంభ మయ్యాయి. కార్యక్రమానికి టీడీపీ నాయకుడు విష్ణుసేన గౌతమ్ రెడ్డి, క్రాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సందీప్ హాజరై మాట్లాడారు. నిత్యం క్రీడల్లో సాధన చేయడం వల్లన దేహదారుఢ్యం, ఆరోగ్యం మెరుగుపడు తుందన్నారు. బాస్కెట్‌బాల్ జిల్లా సంఘం అధ్యక్షుడు నీలిమారెడ్డి, శిక్షకులు మధు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణమాస పూజలు

గూడూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి శనివారం పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. గూడూరు పట్టణంలోని ఆంజనేయస్వామి, కాళికా మాత, తిమ్మగురుడు స్వామి, సంతాన నాగదేవతా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దేవతామూర్తులకు పూజలు చేసి కాయకర్పూరాలు సమర్పించారు.

గిరిజనులను ఆదుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనులను ప్రభుత్వం ఆదుకోవాలని జాతీయ లంబాడీ సంఘం రాష్ట్ర నాయకుడు యోగేష్ నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మైదాన ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. ప్రభుత్వం కల్పించే సబ్సిడీలు, సంక్షేమ పథకాలు, ఉపాధి, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు, పరిశ్రమలలో ఉద్యోగావకాశాలను గిరిజనులకే అత్యధిక శాతం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నాయకుడు కుశలన్న పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుపై దృష్టిపెట్టాలి : ఎంపీడీవో

సి.బెళగల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సన్నకారు రైతులు పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలని ఎంపీడీవో రాణెమ్మ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఎంపీడీవో మాట్లాడుతూ రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివారం కరెంట్ బిల్లులు చెల్లించవచ్చు

కల్లూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కరెంట్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు ఆదివారం కూడా పనిచేస్తాయని విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎస్ ఎం.ఉమాపతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు మీ సమీపంలోని విద్యుత్ బిల్లు చెల్లింపు కేంద్రాల్లో బిల్లులు చెల్లించాలని కోరారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి
● మాధవీనగర్‌లో 'తొలి అడుగు'

కల్లూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. శనివారం 21వ వార్డు మాధవీనగర్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాణ్యం నియోజకవర్గం అబ్బర్వర్ ఆదెన్న, రామచంద్ర, కట్ట వెంకట్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, భరత్‌నాయక్, లక్ష్మణ్‌స్వామి, వెంకటేష్ చౌదరి, గంగాధ ర్‌గౌడ్, మహేష్‌యాదవ్ పాల్గొన్నారు.

తొలి ఏడాదిలోనే సంక్షేమం : ఎమ్మెల్యే దస్తగిరి

కోడుమూరు రూరల్: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి ఏడాదిలో ఎంతో సంక్షేమం జరిగిందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. మండలంలోని అనుగొండలో మండల కన్వీనర్ రామక్రిష్ణారెడ్డి అధ్వర్యంలో శనివారం సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ప్రజ లకు కరపత్రాలు అందించారు. విద్యార్థులను 'తల్లికి వందనం' గురించి ఆరా తీయగా డబ్బులు జమ అయ్యాయని, సీఎంకు విద్యార్థులు ధన్యవా దాలు తెలిపారు. కార్యక్రమంలో రామలింగం, సర్వేశ్వరరెడ్డి, వెంకటే శ్వర్లు, ప్రతాప్, పట్టెక్రిష్ణ, సద్దల బాలక్రిష్ణ, రాజు, బాషా, ఉగాది వెంక టేశ్వర్లు, గుడిసె జయరాముడు, పట్టె మధు పాల్గొన్నారు.

నాగన్నకు నివాళి: అనుగొండ ఎస్సీ కాలనీలో నాగన్న అనే వృద్ధుడు అనారోగ్యంతో మృతి చెందాడని తెలుసుకున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి మృతదేహానికి నివాళి అర్పించారు.

అనంతపురం 'తొలి అడుగు'లో కుడా చైర్మన్

కర్నూలు అర్బన్: అనంతపురం నగరంలోని 12వ వార్డులో టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వరరావుతోపాటు కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ కొంకతి లక్ష్మీనారాయణలు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.


అనంతపురంలో 'తొలి అడుగు'లో పాల్గొన్న కుడా చైర్మన్ సోమిశెట్టి


ప్రజలకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత


అనుగొండలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దస్తగిరి

● **టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో..** కర్నూలు నగరంలోని 44వ వార్డులోని పలు కాలనీల్లో లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు కేఈ జగదీష్ కుమార్ ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాదులు శ్రీనివాస్ భట్, రవికాంత్, మహేష్, మాదన్న, ఎల్‌వీ ప్రసాద్, మనోజ్, శరత్ పాల్గొన్నారు.

సి.బెళగల్: సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని మాజీ ఎంపీటీసీ ధనుంజయుడు అన్నారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్ సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరప త్రాలు అందజేశారు. గోవిందు, నాగరాజు వెంకటేశ్వర్లు, ఈరన్న పాల్గొన్నారు.

గూడూరు: సూపర్ సిక్స్ పథకాలతో పేద ప్రజల జీవితాల్లో వెలుగు నింపిందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కురుకుంద రామాంజనేయులు అన్నారు. శనివారం గూడూరు పట్టణంలోని కాప వీధి, కురుకుంద కాలనీల్లో సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందించారు. సింగిల్ విండో డైరెక్టర్ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ షాషావలి, ఎల్లయ్య, నాయకులు డా.మన్సూన్ బాషా, నాగప్ప యాదవ్, హనుమంతు, వీరకుమార్, చాంద్‌బాషా పాల్గొన్నారు.

మ్యుటేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

నగర పాలక కమిషనర్ విశ్వనాథ్


జూమ్ కాన్ఫరెన్సుకు హాజరైన అధికారులు, అడ్మిన్లు

కర్నూలు న్యూసిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): మ్యుటేషన్‌ను (యజమాని పేరు ఆన్‌లైన్ లోనే మారడం) సచివాలయాల అడ్మిన్లు పకడ్బందీగా నిర్వహించాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అన్నారు. శనివారం కమిషనర్ విజయవాడ నుంచి జూమ్ కాన్ఫరెన్సులో స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయీస్ కాలనీలోని సమావేశ భవనంలో మ్యుటేషన్ విధానంపై అడ్మిన్లతో సమావేశం నిర్వహించారు. మున్సిపల్ సేవల్లో పారదర్శకత పెంచేందుకు వీలుగా ఆగస్టు 1 నుంచి మ్యుటేషన్ ప్రక్రియను సరికొత్త విధానంలో అమల్లోకి తీసుకువస్తుందన్నారు. ఇళ్లు, ప్లాట్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రి య చేయించుకున్న వెంటనే ఆన్‌లైన్ విధానంలో ఆటో మ్యూటేషన్ (ఆన్‌లైన్‌లో పేరుతో ఆస్తి బదలాయింపు) జరుగుతుందని పేర్కొన్నారు. ఆస్తి పన్ను విధింపునకు అడ్మిన్ల లాగిన్‌లకు దరఖాస్తులు వస్తాయని, వాటి ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రక్రియ పూర్తి చేయాలని కమిషనర్ సూచించారు. ఈ కాన్ఫరెన్స్‌లో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, ఆర్‌వోలు, ఆర్‌ఐలు, అడ్మిన్లు పాల్గొన్నారు.

రక్షణ ఆటో వర్కర్స్ యూనియన్ జెండావిష్కరణ

కల్లూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): సి.క్యాంపు సర్కిల్‌లో నూతన రక్షణ ఆటో వర్కర్స్ యూనియన్ జెండాను నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, రక్షణ ఆటోవర్కర్స్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బండిమెట్టలో ఆక్రమణల తొలగింపు

కర్నూలు న్యూసిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని 3వ వార్డు బండిమెట్ట పొట్టిశ్రీరాములు పాఠశాల పక్కన ఆక్రమణలను పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తొలగించారు. ఎంతో కాలంగా ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకుని ఏర్పాటు చేసుకున్న దుకాణాలను శనివారం సిబ్బంది నేలమట్టం చేశారు. దుకాణాలు ఉండటం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతుందని పలువురు ఫిర్యాదు చేశా రు. ఈ క్రమంలోనే ఆక్రమ ణలను తొలగించినట్లు పట్టణ ప్రణాళికా విభాగం అధికారి ప్రదీప్‌కుమార్ తెలిపారు.

క్రికెట్ విజేత ప్రొడక్షన్ టీం


విజేతలకు కప్ అందజేస్తున్న మల్లికార్జున గుప్త

కర్నూలు స్పోర్ట్స్, జూలై 26(ఆంధ్రజ్యోతి): 2025 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్‌ఏపీ క్యాంపు క్రీడా మైదానంలో టీజీవీ గ్రూప్ ఉద్యోగులకు శనివారం క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. టీజీవీ గ్రూప్ విన్నర్‌గా ప్రొడక్షన్ టీం గెలిచింది. రన్నర్‌గా మెకానికల్ టీం నిలిచింది. విజేతలకు టీజీవీ గ్రూప్ చీఫ్ జనరల్ మేనేజర్ మల్లికార్జున గుప్త ట్రోఫీని అందజేశారు. రాజ్యసభ మాజీ సభ్యుడు క్రీడాదాత టీజీ వెంకటేష్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ క్రీడలకు క్రీడాభివృద్ధికి ప్రోత్సహిస్తున్నారని చీఫ్ మేనేజర్ గుప్త తెలిపారు.

భవన నిర్మాణ సంఘం రాష్ట్ర కమిటీలో ఇద్దరికి చోటు

కర్నూలు న్యూసిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏపీ భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీలో నగరం నుంచి ఇద్దరికి చోటు లభించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ తెలిపారు. శనివారం కేకే భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం 8వ రాష్ట్ర మహాసభలు ఈనెల 23, 24 తేదీలలో గుంటూరులో నిర్వహించారన్నారు. ఈసభల్లో జిల్లా నుంచి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ఆర్.నరసింహులు, రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎస్.ఖాజాబాషాను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు సాధన కోసం సెప్టెంబరు 15న విజయవాడలోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చామన్నారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ కె.సుధాకరప్ప పాల్గొన్నారు.

నియామకాలు చేపట్టాలి: డీటీఎఫ్

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ఫలితాలు ప్రకటించి వెంటనే నియామకాలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వీజీ వెంకట్రాముడు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏ పాఠశాలల్లో కూడా పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులు లేరని, ఉన్న అరకొర ఉపాధ్యాయులు ఆన్‌లైన్ పనులకు తప్ప తమ సమయాన్ని విద్యాబోధనకు కేటాయించలేకపోతున్నారన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

సి.బెళగల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మండల కేంద్రమైన సి.బెళగల్ సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు ట్రంక్‌పెట్టెలు, బెడ్ షీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ భాస్కర్ పాల్గొన్నారు.

మైనర్లు వాహనంతో పట్టుబడితే చర్యలు

ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్


కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

కర్నూలు క్రైం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనం ఇచ్చిన వారికి, తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ హెచ్చరించారు. శనివారం నగరంలో రాజ్‌విహార్‌తోపాటు పలు కూడళ్లలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. లైసెన్సు లేకుండా వాహనాలు నడుపుతున్న 15 మంది మైనర్ల వాహనాలను ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు తరలించి మైనర్లకు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే లైసెన్సు లేకుండా వాహనాలు నడపబోమని మైనర్లతో ప్రతిజ్ఞ చేయించారు.

రోడ్డుకు మరమ్మతులు చేయించిన యువత

కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కిసాన్ ఘాట్ రోడ్డులో ఉన్న రహదారిని నగరంలోని శ్రీను కర్రసాము అకాడమీ యువకులు పరిశీలించారు. ఈ రోడ్డుపై నుంచీ అటు బస్టాండుకు, ఇటు ప్రభుత్వాసుపత్రికి వేలాదిగా వాహనాలు తిరుగుతుంటాయి. శనివారం గుంతల మయంగా మారిన ఈ రహదారికి తమవంతుగా మరమ్మతులు చేయాలని భావించారు. ఒక లోడు ఇసుక, కంకర తీసుకువచ్చి, జేసీబీ సాయంతో చదును చేశారు. వాహనాల రాకపోకలకు, పాదచారులు నడిచేందుకు ఇబ్బంది లేకుండా గుంతలను పూడ్చివేశారు. శ్రీను కర్రసాము అకాడమీ అధ్యక్షుడు ఐ.శ్రీనివాసులు, మానవతా సంస్థ ప్రతినిధి జి.యుగంధర్, సభ్యులు వెంకటసాయి, ఆజాద్, ప్రభాకర్, రాము నాయక్, రియాజ్, అభిరామ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్గిల్ విజయ్ దివస్ విజయోత్సవ ర్యాలీ




ర్యాలీలో పాల్గొన్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకులు, ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్

కర్నూలు కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ విజయ్ దివస్ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి మాట్లాడుతూ 1999 జూలై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి ప్రతీకగా ప్రతి సంవత్సరం విద్యార్థి పరిషత్ దేశ వ్యాప్తంగా కార్యక్రమాలను నిర్వహించుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో విభాగ ప్రముఖ్ నాగఫణిశాస్త్రి, మహేష్ పాల్గొన్నారు.

కర్నూలు ఎడ్యుకేషన్: స్థానిక బి.క్యాంపు ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శనివారం ప్రిన్సిపాల్ నాగస్వామి నాయక్ అధ్యక్షతన కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 1999 జూలై 26న భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై విజయం సాధించిన దానికి ప్రతీకగా ప్రతి ఏడాది కార్గిల్ విజయ్ దివస్ జరుపుకుంటున్నామన్నారు. అనంతరం కార్గిల్‌లో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోరంట్ల లక్ష్మీమాధవుడి సన్నిధిలో కోట్ల


కోట్లను సత్కరిస్తున్న పూజారులు

కోడుమూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోరంట్ల లక్ష్మీమాధవుడిని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థాన సిబ్బంది, పూజారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసం తొలి శనివారం సందర్భంగా వెంకటగిరి గిడ్డాంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. కార్యక్రమంలో ఆలయ ఉద్యోగి మురళి, మాజీ సర్పంచ్ దుబ్బన్న, మాజీ ఆలయ చైర్మన్ పరమేశ్వరనాయుడు, అనిల్, కురువ రవి పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో జాబ్‌మేళా

కోడుమూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం జాబ్‌మేళా నిర్వహించారు. ఎల్‌అండ్‌టీ, హెటిరోల్యాబ్స్, ఎస్‌బీఐ కార్డ్స్, సన్ కిసాన్ అగ్రి అండ్ కం, పుష్కల్ అగ్రో టెక్ లిమిటెడ్ వంటి సుమారు 10 సంస్థలు అవకాశాలు కల్పించాయి. ఇంటర్వ్యూలకు సుమారు 145 మంది నిరుద్యోగులు హాజరు కాగా 61 మందికి జాబ్ అవకా శాలు లభించాయి. ఎంపికైన వారికి ప్రిన్సిపాల్ షేక్షావలి అభినందించారు. కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ సాయితేజ, స్కిల్ హబ్ కో- ఆర్డినేటర్ హరిబాబు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించాలి


పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని నెహ్రూ మెమోరియల్, మున్సిపల్ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు పి.నిర్మల డిమాండ్ చేశారు. శనివారం ఆ పాఠశాలలను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలను విద్యార్థులు, అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. నిర్మల మాట్లాడుతూ నెహ్రూ మెమోరియల్ పాఠశాలలో పీఈటీ, హిందీ టీచర్ పోస్టు ఖాళీగా ఉందని తక్షణమే భర్తీ చేయాలన్నారు. మౌలిక వసతులు కల్పించడంతో పాటు లైబ్రరీ ఏర్పాటు చేయాలని కోరారు. మున్సిపల్ పాఠశాలలో వాష్ రూమ్స్, టాయిలెట్లకు నీటి సరఫరా లేదని తక్షణమే బోర్లు వేయించాలన్నారు. పాఠశాలలో ఈనెల ఇద్దరు ఉపాధ్యాయులు రిటైర్ అవుతున్నారని, పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శివర్గసభ్యులు ఎండీ షరీఫ్, మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించాలి : కాంగ్రెస్


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): సంతోష్‌నగర్ నుంచి బాలాజీనగర్ వెళ్లేదారికి ఫ్లైఓవర్ నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ కోడుమూరు ఇన్‌చార్జి అనంతరత్నం శనివారం జాయింట్ కలెక్టర్ బి.నవ్యకు వినతిపత్రం అందజేశారు. అనంతరత్నం మాట్లాడుతూ సంతోష్‌నగర్, బాలాజీనగర్‌కు రోడ్డు మార్గాన ప్రతి రోజు వందలాది మంది రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ ఫ్లైఓవర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా నేషనల్ హైవే 44 ఉండటంతో అనేక మంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. కార్యక్రమంలో హైమావతి, సయ్యద్, మాసుంపీర్, ఎస్‌ఎం ఖాద్రి పాల్గొన్నారు.

ఆటంకాలు లేకుండా తాగునీటి సరఫరా

కర్నూలు న్యూసిటీ, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని సంతోష్ నగర్ వద్ద పైపులైన్ లీకేజీతో తాగునీటి సరఫరాకు ఏర్పడిన ఆటంకాలను త్వరితగతిన అధిగమించి, సాధారణ పరిస్థితులు తీసుకువచ్చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. శనివారం ఆయన టెలికాన్ఫరెన్సు ద్వారా ఇంజనీరింగ్ విభాగ అధికారులు, అమ్యూనిటీస్ కార్యదరులతో తాగునీటి సరఫరాపై సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాలకు ప్రస్తుతం నీరు వెళ్లేందుకు సమయం పడుతుందని, ఆదివారం రాత్రి నుంచి నగర వ్యాప్తంగా తాగునీటి సరఫరా జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పేద విద్యార్థులకు చేయూత అందించాలి


విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

కర్నూలు కల్చరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని కర్నూలు మండల తహసీల్దారు టీవీ రమేష్‌బాబు అన్నారు. ఏపీ ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల జిల్లా సంఘం, లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నగరంలోని బంగారుపేట మున్సి పల్ ప్రాథమిక పాఠశాల్లో చదువుకుంటున్న విద్యార్థులకు, విశ్రాంత తహసీల్దార్ మురారి శంకరప్ప సౌజన్యంతో ఉచిత ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రమేష్‌బాబు మాట్లా డారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ ప్రతినిధి డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, విశ్రాంత డీఎస్పీ పాపారావు, తిరుపతి సాయి పాల్గొన్నారు.



గతంలో శిథిలావస్థకు చేరిన నీటి తొట్లను రాష్ట్ర ప్రభుత్వం బాగుచేసింది. మండలంలోని 7 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం కింద తొట్లను నిర్మించి నీటితో నింపారు. జీవాలతోపాటు పక్షులు కూడా దాహార్తి తీర్చుకుంటాయని ఏపీవో నర్సిరెడ్డి తెలిపారు. - మద్దికెర



ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● తుంగభద్ర నదికి భారీగా నీటి విడుదల : ఎస్ఈ

హాలహర్వి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర నదీపరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బోర్డు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఎగువన భారీ వర్షాలు కురుస్తుండంతో గేట్లను ఎత్తి నదికి నీటిని విడుదల చేస్తున్నట్లు తుంగభద్ర బోర్డు ఎస్ఈ నారాయణనాయక్ తెలిపారు. శనివారం తుంగభద్ర జలాశయంలోకి 90 వేల క్యూసెక్కుల నీరు చేరిందన్నారు. దీంతో 32 గేట్లు ఎత్తి నదికి నీటిని విడుదల చేశామన్నారు. కోసిగి, మంత్రాలయం, కౌతాళం తదితర మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. నదిలోకి స్నానాలకు వెళ్లవద్దన్నారు.

78 బంగారు కుటుంబాల దత్తత


మాట్లాడుతున్న కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ

ఆదోని టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అమరావతి నగర్ 35 వ వార్డులో 78 బంగారు కుటుంబాలను తాను దత్తత తీసుకుంటున్నట్లు కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ అన్నారు. తన వార్డు పరిధిలో 106 కుటుంబాలు ఉన్నట్లు ప్రభుత్వ సర్వేలో తేలిందన్నారు. శనివారం వార్డు సచివాలయంలో అడ్మిన్ నాగబాబు అధ్యక్షతను జరిగిన పీ-4 కార్యక్రమం నిర్వహించారు. మిగతా 28 కుటుంబాలను సచివాలయ సిబ్బంది, బీజేపీ నాయకుడు పరశురాం దత్తతకు తీసుకున్నారని తెలిపారు. తాను దత్తతకు తీసుకున్న కుటుంబాలను పలకరించి వారి ఇబ్బందులు తొలగించడానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు కుటుంబాలను దత్తత తీసుకొని, సామాజికంగా, ఆర్థికంగా అండగా నిలవాలని సూచించారు. వెల్లాల మధుసూదన్ శర్మ, సిబ్బంది గౌసియా అపర్ణ, రాజేశ్వరి, హైమావతి, శ్రీనివాసులు, స్వయం ప్రభ, యశోద ఉన్నారు.

ఎమ్మెల్యేకు ఆహ్వానం

మద్దికెర, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరవలి గ్రామంల రంగనాథ స్వామి శ్రావణ మాస ఉత్సవాలకు ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబును ఆలయ ఈవో వీరయ్య శనివారం ఆహ్వానించారు. ప్రతి శనివారం ఆలయంలో భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. నల్లమేకల చౌదరి, సిబ్బంది రఘు ఉన్నారు.


ఎమ్మెల్యేకు పత్రిక ఇస్తున్న ఈవో

కౌలు కార్డులు జారీ

వెల్దుర్తి టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో శనివారం కౌలు కార్డులు పంపిణీ చేసినట్లు ఏవో అక్బర్ బాషా, డీటీ గురుస్వామి తెలిపారు. ఇప్పటి వరకు 250 కార్డులు పంపిణీ చేశామని, ఇంకా కొంత మందికి ఇవ్వాల్సి ఉందన్నారు.


కౌలుకార్డు ఇస్తున్న అధికారులు

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


బైకు ర్యాలీలో ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు

ఆలూరు(చిప్పగిరి), జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు అన్నారు. శనివారం చిప్పగిరి మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో బెల్డోణ మీదుగా చిప్పగిరి, బంటనహాల్ వరకు టీడీపీ నాయకులు బైకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కన్వీనర్ వల్లి, నాయులు హరి, సురేష్, భూపాల్, వెంకటేశ్వర్లు, సర్పంచ్ పురుషోత్తం పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతికి సీఎం కృషి

దేవనకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రజల అభ్యున్నతికి సీఎం చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నట్లు టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, మలకన్న, ఆకుల వీరేష్ అన్నారు. శనివారం దేవనకొండలోని బీసీ కొట్టాల, మాలగేరిలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' నిర్వహించారు. కాలనీల ప్రజలను అడిగి సంక్షమ పథకాలను తెలుసుకున్నారు. నాయకంటి రాజు, మస్తాన్, రాజాసాబ్, చాంద్, సుబాన్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలు ఇస్తున్న నాయకులు

సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలి


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పార్టీ అధినాయకత్వం సూచన మేరకు ఇంటింటికి టీడీపీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రచారం చేయాలని టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ సూచించారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కన్వీనర్, క్లస్టర్ ఇన్‌చార్జి, బూత్ ఇన్‌చార్జిలను అభినందించారు. ఇదే ఉత్సాహంతో మరో నాలుగు రోజులు కష్టపడి ప్రతి ఇంటికి వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ అశోక్, డా.నెట్టప్ప, సోమశేఖర్‌నాయుడు, మసాల జగన్ ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ బాధితులకు వరం


చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

● ఎమ్మెల్యే పార్థసారథి.. బాధితులకు చెక్కుల పంపిణీ

ఆదోని, జూలై 26(ఆంధ్రజ్యోతి): చికిత్సలు చేయించుకున్న బాధితులకు సీఎం సీఎం సహాయ నిధి వరమని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. శనివారం క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధి రూ.5,32,485ల చెక్కులను 15 మంది బాధితులకు పంపిణీ చేశారు. వైద్య ఖర్చుల కోసం అధికంగా ఖర్చు చేసిన వారు సీఎం సహాయ నిధి సాయం పొందవచ్చాన్నారు.

ఉచిత ఇసుకను వినియోగించండి

గృహాలు నిర్మించుకునే ప్రజలు ప్రభుత్వం సరఫరా చేస్తున్న ఉచిత ఇసుకను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పార్థసారథి సూచించారు. శనివారం క్యాంపు కార్యాల యంలో మాట్లాడుతూ ట్రాక్టర్లు, టిప్పర్లలో వాగులు వంకల నుంచి వచ్చే ఇసుకతో మోసపోవొద్దన్నారు. ఇసుక రీచ్‌ల నుంచి నాణ్యమైన ఇసుక రూ.4200లకు ప్రభుత్వం ఇస్తుందన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను సీజ్ చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

90 శాతం హామీల అమలు

ఆదోని, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 90 శాతం అమలు చేశామని కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, టీడీపీ నాయకులు ఉమాపతినాయుడు, గుడిసె కృష్ణమ్మ అన్నారు. శనివారం సుల్తానాపురం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఏడాది పాలనపై కరపత్రాలను పంచారు. అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా సీఎం చంద్రబాబు అడుగులు వేస్తున్నారన్నారు. షేక్‌ముంతాజ్, రామస్వామి, రంగన్న, శివప్ప, నీలకంటప్ప, ఉమ్మిసలీం తదితరులు పాల్గొన్నారు.


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఉమాపతినాయుడు

పనులను నిర్లక్ష్యం చేయొద్దు

ఆదోని రూరల్, జూలై 26 ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధి పనులను నిర్లక్ష్యం చేయొద్దని పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఎల్‌పీవో తిమ్మక్క, ఎంపీడీవో జనార్థన్ సూచించారు. శనివారం పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడుతూ, స్వర్ణ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా, ఇల్లు, స్థలం లబ్దిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో పొందపర్చాలన్నారు.


మాట్లాడుతున్న డీఎల్‌పీవో తిమ్మక్క


యూరియా కోసం రైతుల అవస్థలు

● ఐదు రోజులుగా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ


యూరియా కోసం డీసీఎంఎస్ కేంద్రానికి వచ్చిన రైతులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు అవస్థలు పడుతున్నారు. శనివారం కమిటీలోని డీసీఎంఎస్ కేంద్రానికి యూరియా కోసం వచ్చిన రైతులు దొరక్కపోవడంతో నిరాశకు గురయ్యారు. ఐదు రోజులుగా ఆదోని వ్యవసాయ అధికారి కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు కురుస్తుండటంతో పత్తి, వేరుశనగకు యూరియా అవసరమని రైతులు పేర్కొంటున్నారు. స్పందించిన ఏవో సుధాకర్ రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు ఉన్నాయని అక్కడికి వెళ్లాలని సూచించారు.

సారా స్థావరాలపై దాడులు


బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సీఐ, ఎస్ఐ

హొళగుంద, జూలై 26 (ఆంధ్రజ్యోతి): నేరణికి, నేరణికి తండా కొండల్లో సారా స్థావరాలపై దాడులు చేసి ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ లలితదేవి, ఎస్ఐ గురజాల దిలీప్‌కుమార్, ఎక్సైజ్ ఎస్ఐ నవీన్‌బాబు శనివారం తెలిపారు. 150 లీటర్ల బెల్లం ఊట, 25 సారా ధ్వంసం చేశామన్నారు. సారా తయారీతో కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించామన్నారు.

విద్యార్థులకు చేయూత

ఆదోని అగ్రికల్చర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): వివిధ వృత్తుల్లో స్థిరపడిన ఆదర్శ మిత్రమండలి సభ్యులు పేద పిల్లల చదువులకు చేయూతనిస్తున్నారు. శనివారం 20మంది కళాశాల, పాఠశాల విద్యార్థుల ఫీజులు చెల్లించారు. చిన్మయ మిషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మిత్రమండలి సభ్యుడు సురుపూడి అనంత మాట్లాడుతూ విరుపాపురం, విద్యానగర్ జడ్పీ పాఠశాలలకు పర్నిచర్ కంప్యూటర్ అవసరమైన సామాగ్రిని అందజేశామన్నారు. కేశవయ్య రవి ప్రకాష్ రెడ్డి, శ్యాంసుందర్ రెడ్డి, శ్రీవాణి పాల్గొన్నారు.


విద్యార్థులతో మిత్ర మండలి సభ్యులు

రాష్ట్రంలో ముంచే పాలన


మాట్లాడుతున్న శ్రీదేవి

పత్తికొండటౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సుపరిపాలన కాదు ముంచే పాలన సాగుతోందని పత్తికొండ మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి ఆరోపించారు. శనివారం ఆమె పత్తికొండలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో పథకాలు అమలు చేస్తామని ఓట్లు వేయించుకున్న చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విఫలమయ్యారన్నారు. నిధులు లేవని, ఆడబిడ్డ నిధి ఇవ్వాలంటే రాష్ట్రాన్ని అమ్మే యాల్సి వస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. సంక్షేమ పథకాలకు ఎంత ఖర్చు అవుతుం దో ఎన్నికలకు ముందు తెలియదా? అని ప్రశ్నించారు. ఐదేళ్లలో జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేసే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. వైసీపీ హయాంలో భూసేకరణ వల్లే హంద్రీనీవాకు నీరు వచ్చిందని, పత్తికొండకు వచ్చి న కార్మికశాఖ మంత్రి వాస్తవాలు తెలుసుకోవాలన్నారు. పట్టణంలోని లఓజ్మానగర్‌లో 'బాబుషూరిటీ-మోసం గ్యారంటీ'లో భాగంగా మాజీ ఎంపీపీ నాగరత్నమ్మతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు శ్రీరంగడు, సోమశేఖర్, ఎంపీపీ నారాయణదాస్, సర్పంచ్ కొమ్ము దీపిక, కన్వీనర్ నాగరాజు ఉన్నారు.

టీడీపీతోనే అభివృద్ధి

తుగ్గలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం ప్రభుత్వంలోనే బీసీలు అభివృద్ధి చెందుతున్నారని ఆ పార్టీ నాయకులు వెంకటస్వామి, మిద్దె వెంకటేశ్ యాదవ్ అన్నారు. శనివారం జొన్నగిరిలో సమావేశంలో మాట్లాడుతూ ఏడాదిలో చేసిన అభివృద్ధిని వివరించే 'సుపరి పాలనలో తొలి అడుగు' మండలంలో విజయవంతమైందన్నారు.

కార్గిల్ విజయం స్ఫూర్తి

ఆదోని అగ్రికల్చర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): కార్గిల్ విజయం భారతీయులకు స్ఫూర్తి అని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. శనివారం ఎమ్మిగనూరు బైపాస్ లో ఉన్న కిడ్డీస్ విద్యాసంస్థల్లో కార్గిల్ విజయ్ దివస్‌కు ఎమ్మెల్యే హాజరయ్యారు. అనంతరం సైనికులను సన్మానించారు. డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చిన్నపరెడ్డి పాల్గొన్నారు

డెంగీ కేసు నమోదు

దేవనకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాతమార్కెట్ కాలనీకి చెందిన నాలుగేళ్ల బాలుడికి డెంగీ సోకినట్లు మలేరియా అధికారి నూకరాజు శుక్రవారం తెలిపారు. నాలుగు రోజులుగా జ్వరం వస్తుండటంతో కర్నూలులో రక్తపరీక్షలు చేయగా, డెంగీ నిర్ధారణ అయిందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలని, నీరు నిలువ వుండకుండా చూసుకోవాలన్నారు.

వర్షం వచ్చింది.. బురద మిగిల్చింది


బురదమయంగా మారిన అరికెర రోడ్డు

ఆలూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): చిన్న వర్షం కురిస్తే చాలు పట్టణంలోని అరికెర రోడ్డు బురదయమంగా మారుతోంది. ఈ రహదారిపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ దారిలోనే ఎల్లార్తి, హొళగుంద, అరికెర ప్రాంతాలకు వెళ్లాలి. సీసీ రోడ్డు ఉన్నా గుంతలు పడటంతో బురద చేరి మట్టిరోడ్డుగా మారింది. రోడ్డుపక్కనే చికెన్, మాంసం దుకాణాలు కూడా ఉన్నాయి. దీంతో దుర్వాసనతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి, వర్షపు నీరు పోయేందుకు కాలువలను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు

దేవనకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లెదొడ్డి గ్రామ రహదారికి రూ.2 కోట్లు మంజూరైనట్లు ఆర్‌అండ్‌బీ జేఈ సునీల్‌కుమార్, డీఈ శివరుద్రకుమార్, ఆదోని ఈఈ పద్మానాభరెడ్డి తెలిపారు. శనివారం దేవనకొండలోని చెరువుకట్ట నుంచి గద్దెరాళ్ల వరకు రహదారిని పరిశీలించారు. జిల్లెడు బుకల వరకు త్వరలోనే పనులు ప్రారంభి స్తామన్నారు. దేవనకొండలోని చెరువుకట్టపై కల్వర్టు ఏర్పాటు చేయాలని విశ్రాంత హెచ్‌ఎం ఉచ్చీరప్ప కోరగా, అది తమ పరిధిలోకి రాదని, గ్రామ పంచాయతీ నిధులతోనే నిర్మించుకోవాలని సుచించారు.


రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

విద్యుత్ అంతరాయం రాకూడదు : ఎస్ఈ


సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ ఉమాపతి

దేవనకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో విద్యుత్ అంతరాయం రాకూడదని ఎస్ఈ ఉమాపతి సిబ్బందిని ఆదేశించారు. శనివారం దేవనకొండ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రైతులు, గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా సక్రమంగా చేయాలని, ప్రజలు సూర్యఘర్ పట్ల ఆసక్తి చుపాలన్నారు.

కంప్యూటర్ విరాళం

ఆదోని టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): లక్ష్మమ్మ బ్యాంకు ప్రతినిధులు శనివారం ఆర్‌ఆర్ లేబర్ కాలనీ మునిసిపల్ పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. కంప్యూటర్ పరిజ్ఞానం విద్యార్థులకు అవసరమని భావించి అందజేసినట్లు బ్యాంక్ వైస్ చైర్మన్ లక్ష్మీ నారాయణ అన్నారు. డైరెక్టర్లు హుస్సేన్ అహమ్మద్, సురేష్ గుప్త, విరుపాక్షి రెడ్డి, స్కూల్ హెచ్‌ఎం కే రవి పాల్గొన్నారు.


కంప్యూటర్ అందజేస్తున్న బ్యాంక్ డైరెక్టర్లు

ఎన్‌పీసీఐ లింక్ తప్పనిసరి

తుగ్గలి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): రైతులు 'అన్నదాత సుఖీభవ'కు అర్హత పొందాలంటే ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింకు తప్పనిసరని ఏవో సురేష్ తెలిపారు. శనివారం వ్యవసాయ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలో దాదాపు 13,500 మంది రైతులు పథకానికి అర్హత పొందారన్నారు. ఇంకా 574 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు లింకు లేదన్నారు. వారు వెంటనే తమ బ్యాంకుకు వెళ్ల ఎన్‌పీసీఐ లింక్ చేయించుకోవాలన్నారు. అలాగే ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను ఈక్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

మరమ్మతులు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో మినరల్ వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేయించాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి దస్తగిరి డిమాండ్ చేశారు. శనివారం నెహ్రూ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజన సమయంలో విద్యార్థులకు తాగునీరు అందడం లేదన్నారు. శేఖర్, మోహన్, పవన్ పాల్గొన్నారు.


భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

డివైడర్లు పడి వాహనదారుడికి గాయాలు


వాహనదారుడిపై పడిన డివైడర్లు ఇవే..

పత్తికొండ టౌన్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ సమస్య నివారణకు ఏర్పాటు చేసిన డివైడర్లు వాహనదారులు ప్రమాదాలబారిన పడేలా ఉన్నాయి. అంబేడ్కర్ సర్కిల్ నుంచి రెండు ప్రధాన రహదారులు ఉండగా ఒకటి ఆదోని రహదారి మరోటి కర్నూలుకు వెళ్లే దారి. బలమైన గాలి వీయడంతో ఈ రహదారుల్లో ఏర్పాటు చేసిన బారికేడ్లు శుక్రవారం పెద్దహుల్తి గ్రామానికి చెందిన కారుమంచి బైకుపై వస్తుండగా మీద పడటంతో గాయాలపాలయ్యాడు. ట్రాఫిక్ పోలీసులు, పంచాయతీ అధికారులు స్పందించి నాణ్యమైన డివైడర్లను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

శాశ్వత అన్నదానానికి విరాళం



దాతకు స్వామి వారి ప్రసాదాలను అందిస్తున్న దృశ్యం

కౌతాళం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో భక్తులకు అందిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి శనివారం ఓభక్తుడు రూ.63వేల నగదును విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అర్చకులు స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి లడ్డూ, ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగేష్ స్వామి ఉన్నారు.

పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

గోనెగండ్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులు సూక్ష్మ నీటి సాగు పథకాన్ని సద్వినియోగం చేసుకుని పంటలు అధికంగా పండించుకోవాలని సూక్ష్మనీటి సాగు పథకం జిల్లా సంచాలకులు శ్రీనివాసులు తెలిపారు. శనివారం మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో పథకం జిల్లా సంచాలకులు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆఫ్టర్ సేల్ సర్వీస్ క్యాంప్‌ను డ్రిప్ రైతు రాంప్రసాద్‌రెడ్డి పొలంలో డ్రిప్ పైపుల పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజనీర్ విజయ్‌కుమార్, ప్రతినిధి సుబ్బయ్య , రైతులు పాల్గొన్నారు.

రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర పత్తికొండ, దేవనకొండ రైతులకు పత్తిపంటలో యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముందుగా కొటేకల్లు గ్రామంలో రైతులు సాగు చేసిన పత్తిపంటను పరిశీలించారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తిపంట ప్రస్తుతం పూత దశలో ఉందని ఈ సమయంలో జీడు ఎక్కువగా ఆశించడం జరుగుతుందన్నారు. పెనుబంక పిల్ల, పెద్ద పురుగులు, ఆకు అడుగు భాగాన కొమ్మలపై నుంచి రసం పీలుస్తూ జీవిస్తాయన్నారు. ఇవి విసర్జించే తేనె వంటి పదార్థం వల్ల ఆకులు, కాండంపై మసితెగులు వ్యాపిస్తుందన్నారు. ఇందుకు నివారణగా వేపనూనె 5 మి.లీ/లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. ఎకరాకు 10 పసుపు రంగు జిగురు అట్టలు పెట్టుకోవాలన్నారు. గులాబీరంగు పురుగు ఉధృతిని గమనించడానికి ఎకరాకు ఆరు లింగాకర్షక బుట్టలు పెట్టుకోవాలన్నారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తే మంచి దిగుబడి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మౌనిక, సుధాకర్, కృష్ణ, కోడుమూరు, దేవనకొండ రైతులు పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి న్యాయం చేశాం

టీడీపీ మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



ఆర్లబండ సొసైటీ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న నాడిగేని అయ్యన్న



కోసిగిలో చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న అయ్యన్న, డైరెక్టర్లు

కోసిగి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం ఎవరు కష్టపడ్డారో.. వారికి న్యాయం చేశామని మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన కోసిగిలోని ఆర్లబండ సొసైటీ కార్యాలయంలో చైర్మన్‌గా నాడిగేని అయ్యన్న, డైరెక్టర్లుగా చిదానంద, కురువ అయ్యన ప్రమాణ స్వీకారం కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. వందలాది మంది టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఆర్లబండ సొసైటీ బ్యాంకు వరకు డప్పు వాయిద్యాల మధ్య మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డిని ఊరేగింపుగా చైర్మన్, డైరెక్టర్లు, అభిమానులు తీసుకువచ్చారు. ముందుగా ఆర్లబండ సొసైటీ కార్యాలయంలో చైర్మన్‌గా నాడిగేని అయ్యన్న, డైరెక్టర్లుగా చిదానంద, కురువ అయ్యన్న పూజా కార్యక్రమం నిర్వహించి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. వీరికి మంత్రాలయం టీడీపీ, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు రాఘవేంద్రరెడ్డి, లక్ష్మన్న, విష్ణువర్ధన్ రెడి కలిసి శాలువ కప్పి పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం చౌడేశ్వరీదేవి ఆలయంలో ఏర్పాటుచేసిన సభలో చైర్మన్ నాడిగేని అయ్యన్నతో పాటు ఇద్దరు డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ 'వైసీపీ ప్రభుత్వంలో పదవులు ఇచ్చి పవర్ తమ దగ్గర ఉంచుకున్నారని, పదవులు తీసుకున్నవారికి కుర్చీల్లో కూర్చోవడానికే అనుమతి తప్ప... పవర్ ఇవ్వ లేదని, అది ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పాలన' అని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నాలుగు మండలాలకు తమ కుటుంబ సభ్యులనే ఇన్‌చార్జిలుగా పెట్టుకుని అధికారం చెలాయించారన్నారు. కూటమి ప్రభుత్వంలో పార్టీ కార్యకర్తలు, నాయకులకే అధికారాలు ఇస్తున్నామని వారి చేతుల మీదుగానే అభివృద్ధి జరుగుతుందని, అది కూటమి ప్రభుత్వం ఘనత అని రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన నాడిగేని అయ్యన్న మాట్లాడుతూ పార్టీ గుర్తించి చైర్మన్ పదవి ఇచ్చి న్యాయం చేసిందని, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ పదవి ఇచ్చి గౌరవించారనీ వారికి రుణపడి ఉంటామని, అహర్నిశలు కష్టపడి ఇచ్చిన పదవికి, రైతులకు న్యాయం చేస్తామని రైతులకు సకాలంలో ఎరువులు, రుణాలు అందించేందుకు కృషి చేస్తాననీ తెలిపారు. కార్యక్రమంలో ముత్తురెడ్డి, సురేష్ నాయుడు, వక్రాణి వెంకటేష్, జ్ఞానేష్, బీజేపీ నాయకులు రాముడు, వీరారెడ్డి, చింతలగేని నర్సారెడ్డి, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్, టీడీపీ లీగల్ సెల్ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, సీఈవో హేమంత్ కుమార్,న్యాయవాదులు హనుమేష్, లావణ్య, సతీష్ నాయుడు, రామాంజనేయులు, మాణిక్యరాజు, కోసిగయ్య, ఈరయ్య, రంగారెడ్డి , సల్మాన్, హరినాథ్ పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దాం

కౌతాళం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పార్టీలకతీతంగా అందరం కలిసి గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని కౌతాళం ఎంపీపీ అమరేశ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అమరేశ అధ్యక్షతన ఎంపీడీవో రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని వర్షాకాలం కావడంతో గ్రామాల్లో ప్రజలు రోగాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. నదిచాగి ఎంపీటీసీ లింగనగౌడ్ మాట్లాడుతూ జాతీయ ఉపాధి పథకం కింద రోడ్లకు ఇరువైపుల మొక్కలు నాటి వాటి సంరక్షణను ఉపాధి సిబ్బంది గాలికి వదిలారని తెలిపారు. రైతులకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని ప్రతి గ్రామానికి రెండు లారీల యూరియాను త్వరలో అందజేస్తామని మండల ఏవో శేషాద్రి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, వైస్ఎంపీపీలు రామలింగయ్య స్వామి, లిఖిత, కోఆప్షన్ సభ్యులు మాబుసాబ్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలను దత్తత తీసుకోవాలి

గోనెగండ్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామంలో సంపన్న కుటుంబాలు.. పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారి అభివృద్ధికి పాటు పడాలని ఈవోఆర్‌డీ అనంతశయన, మేజర్ గ్రామ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీశ్ కోరారు. శనివారం వారు గోనెగండ్ల గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీ4 సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవోఆర్‌డీ మాట్లాడుతూ గోనెగండ్ల మండలంలోని గ్రామాల్లో 1836 కుటుంబాలను పేద కుటుంబాలుగా ప్రభుత్వం గుర్తించిందని అలాగే మండల కేంద్రమైన గోనెగండ్లలో 644 కుటుంబాలను పేద కుటుంబాలుగా గుర్తించినట్లు ఆయన తెలిపారు. సంపన్నకుటుంబాల వారు పేద కుటుంబాలను దత్తత తీసుకుని వారికి ప్రభుత్వం నుంచి వచ్చే సదుపాయాలు కల్పించాలని అలాగే వ్యక్తి గతంగా కూడా సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ మలాంగ్, సుభాన్, అనిల్ పాల్గొన్నారు.

వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలి

గోనెగండ్ల, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గతంలో ఏర్పాటు చేసిన వేతన సవరణ సంఘం కాల పరిమితి ముగిసిందని దీంతో కొత్త వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప, జిల్లా గౌరవఅధ్యక్షుడు వీరన్న, జిల్లా కార్యదర్శి గంగాధర్, నంద్యాల జిల్లా అధ్యక్షుడు కిషోర్ డిమాండ్ చేశారు. శనివారం వారు గోనెగండ్ల మండంలోని పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

అవగాహన కల్పించాలి

మంత్రాలయం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించాలని మంత్రాలయం ఎస్‌ఐ శివాంజల్ అన్నారు. శని వారం మంత్రాలయం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అంపయ్య అధ్యక్షతన నేరాలు, మైనర్ బాలికలు, మహిళలపై జరిగే అఘా యిత్యాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ జోలికి వెళ్లకూడదన్నారు. ఉపాధ్యాయులు విఠోభరావు, గోట్ల చంద్రశేఖర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

నందవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలో కౌలు రైతులు రైతు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దారు శ్రీనివాసులు తెలిపారు. పంచాయతీ కార్యాలయ ఆ రణంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవీంద్రరెడ్డి ఆధ్వర్యంలో కౌలు రైతులకు ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని కౌలు రైతులు తాము సాగు చేసుకున్న పంట భూ యజమాని వివరాలతో మీరు కౌలు చేస్తున్న సర్వే నెంబర్, సాగు విస్తీర్ణం వివరాలు అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు కౌలు రైతులకు వచ్చే పంట రుణాలు లబ్ధి పొందుటకు గాను కౌలు రైతు కార్డు తప్పని సరిగా ఉండాలన్నారు. ఇందుకు తమ గ్రామ రెవెన్యూ అధికారులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

నందవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీపీ ముగతి లక్ష్మీదేవమ్మ అధికారులను కోరారు. శనివారం మండల కేంద్రమైన నందవరం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో పుల్లయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించాలని అధికారులకు సూచించారు. వర్షాలు అధికంగా వస్తుండడంతో పారిశుధ్యంతో పాటు ప్రజల ఆరోగ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పీఆర్ ఏఈ నరసింహులు మాట్లాడుతూ ఎన్‌ఆర్ఈజీఎస్ కింద గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించామని తెలిపారు. ఎంపీడీవో పుల్లయ్య మాట్లాడుతూ 'తల్లికి వందనం' ప్రతిఒక్కరికి వచ్చేలా చూస్తామన్నారు. అందరి సర్టిఫికెట్లు విచారిస్తున్నామన్నారు. సమావేశంలో అధికారులు డాక్టర్ శ్రీలేఖ, ఇన్‌చార్జు ఎంపీడీవో సందీప్, ఏఈలు నరసింహులు, బాలకృష్ణ, నాగేంద్ర, ఎంఈవో రఘునాథ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహదేవి, ఎంపీటీసీ బత్తమ్మ, అతావుల్లా, షేక్ అహ్మద్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో చోరీ

ఎమ్మిగనూరు రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరాలదొడ్డి సమీపంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దేవాలయంలో గుర్తు తెలియని దుండగుడు ప్రధాన తలుపులు, హుండీ తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించాడన్నారు. దేవాలయా నికి ఉన్న లైట్లను ఆర్పివేసి రూ.30వేలు విలువ చేసే మైక్‌సెట్, రూ.3వేలు విలువ చేసే గంటతో పాటు హుండీలో ఉన్న నగదును దోచుకెళ్లాడన్నారు. ఇప్పటి వరకు దేవాలయంలో దాదాపు ఆరు సార్లకు పైగా చోరీ జరిగిందన్నారు. చోరీ సంఘటనపై దేవాలయం ధర్మకర్త వడ్డె వెంకటేష్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా రూరల్ ఎస్‌ఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎమ్మిగనూరు సమీపంలోని కర్నూలు ప్రధాన రహదారిలో ఉన్న బాట మారెమ్మవ్వ దేవాలయంలో కూడా చోరీ జరిగినట్లు తెలుస్తోంది. అమ్మవారి విగ్రహానికి ఉన్న చేతిని పగులగొట్టడమేగాక హుండీలోని నగదును దోచుకెళ్లినట్లు సమాచారం.

లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే చర్యలు

నందవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): లైసెన్స్ లేకుండా వాహనం నడిపితే జరిమానా విధించడమే కాకుండా వాహనాలను కూడా సీజ్ చేస్తామని ఎస్‌ఐ కేశవ తెలిపారు. శనివారం నందవరంలోని ముగతి దగ్గర, దర్మాపురంలోని టోల్ ప్లాజా దగ్గర, నందవరం పోలీస్‌స్టేషన్ దగ్గర వాహనాల తనిఖీ చేసి లైసెన్స్ లేని వాటికి జరిమానా విధించారు. అలాగే కొనసాగితే సీజ్ చేస్తామన్నారు. హెల్మెట్ వాడకం వల్ల నివారించే ప్రమాదాలు, సైబర్ నేరాల గురించి, ఓటీపీ ఫ్రాడ్స్ గురించి, ఏపీకే ఫైల్స్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనలో భాగస్వాములు కావాలి

ఎమ్మిగనూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ భవనంలో నియోజకవర్గంలోని ఆయా శాఖల అధికారులు, విద్యావేత్తలు, సామాజిక సేవా కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ పేదరిక నిర్మూలకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలన్నారు. పేదలను ఆదుకునేందుకు మానవతా దృక్పథంతో ముందుకు రావాలన్నారు. ఇందుకు ప్రభుత్వం కూడా సహకారాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 7,323కు పైగా బంగారు కుటుంబాలను గుర్తించామన్నారు. త్వరలో ఈ కుటుంబాల సంఖ్య మరింత పెరగవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి ప్రసూన, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల తహసీల్దార్‌లు, ఆయాశాఖల అధికారులు, సామాజిక సేవా కార్యకర్తలు, పాల్గొన్నారు.

మంచాల సొసైటీ స్థలం కబ్జా

మంత్రాలయం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చుమర్రి సొసైటీ (కల్లుదేవకుంట సొసైటీ)కి అప్పటి అధ్యక్షులుగా మాలపల్లి సత్యనారాయణరెడ్డి మాలపల్లి గ్రామంలో ఉన్న సర్వే.నెం.117/ఏలో ఉన్న 5 సెంట్ల స్థలాన్ని సొసైటీకి రిజిస్టర్ చేసి ఇచ్చారు. అయితే 2017లో అప్పటి సొసైటీ అధ్యక్షులు చిలకలడోన వెంకటరెడ్డి కుట్ర పన్ని సొసైటీకి అమ్మిన 5 సెంట్ల స్థలంలో అక్రమంగా ప్రవేశించి స్థలాన్ని కబ్జా చేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి అద్దెకు ఇచ్చారన్నారు. కల్లుదేవకుంట సొసైటీ సీఈవో బి.వెంకటేశ్ మాధవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించి మాలపల్లిలో ఉన్న సొసైటీ స్థలం 5 సెంట్లు ఆక్రమించుకున్న సత్యనారాయణరెడ్డి, అతనికి సహకరించిన వెంకటరెడ్డిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థినుల సమస్యలు పట్టవా?

ఎమ్మిగనూరు రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు హాస్టల్ విద్యార్థినుల సమస్యలు పట్టవని పీడీఎస్‌యూ, ఎన్‌ఎస్‌యూఐ, వైఎస్సార్ విద్యార్థి విభాగం నాయకులు మహేంద్రబాబు, వీరేష్‌యాదవ్, ఉసేని అన్నారు.

ప్రత్యేక బస్సులు నడపాలి

ఎమ్మిగనూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో వెలసిన ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాస ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక బస్సులు నడపాలని కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు కో-ఆర్డినేటర్ కాశింవలి కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ డీఎం మద్దిలేటిని కాశిం వలి, ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్ కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు షబ్బీర్, రఫీక్, నరసప్ప, వలి, ఆసీఫ్, హర్షకుమార్, లోకేష్, అజయ్ పాల్గొన్నారు.

ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలి

ఎమ్మిగనూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడికల్ గ్రామంలో అంబేడ్కర్ ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మించాలని గ్రామ టీడీపీ నాయకులు దేవదాస్, మాదన్న, కుమార్, సత్యరాజు కోరారు. శనివారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఏసేపు, కరుణాకర్, నల్లన్న, రంగన్న, ఆదాం, రాజు, అనిల్, నాగన్న, యువరాజు, బాలస్వామి, దావీదులు పాల్గొన్నారు.

'ఎంఈవో అధికార దుర్వినియోగం'

మంత్రాలయం, జూలై 26 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం ప్రైవేటు పాఠశాలలకు వత్తాసు పలుకుతూ అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఎంఈవో-1 మోయినుద్దీన్‌ను సస్పెండ్ చేసి విధుల నుంచి తొలగించాలని ఆర్‌ఎవీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘునాథ్, ఆర్‌పీఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షాహీద్ అఫ్రీదీ అన్నారు. శని వారం మంత్రాలయంలోని ఎంఆర్‌సీ కార్యాలయం ఎదుట ఎంఈవో-1 మోయినుద్దీన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. సస్పెండ్ చేయకపోతే విద్యార్థి సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.